


కాలమ్-6.. సరిదిద్దారు

- అడంగల్ అవస్థలకు చెక్
- భూ విక్రయాలకు లైన్‌క్లియర్
- మూడేళ్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం
- తెనాలిలో రెవెన్యూ శాఖ ప్రయోగం విజయవంతం
- ఈ దిశగా అంతటా పరిష్కారం చూపితే ఫిర్యాదులు తగ్గినట్లే

భూ రికార్డుల ఆధునికీకరణలో జరిగిన పొరపాట్లు.. వైసీపీ హయాంలో చేసిన తప్పులు.. భూ యజమానులకు గుదిబండగా మారాయి. తరతరాల నుంచి వచ్చినా.. రెక్కల కష్టంతో కొనుగోలు చేసినా.. అవి ప్రభుత్వ భూములుగా చూపించడంతో యజమానులు విలవిలలాడిపోయారు. క్రయవిక్రయాలు లేక అల్లాడిపోయారు. కాలమ్ నంబరు-6లో సవరణ.. వేల మంది భూ యజమానులకు సంకటంగా మారింది. అత్యవసర సమయంలో అమ్ముకుంటే ఆర్థికంగా అండగా ఉంటుందనుకున్న భరోసాతో ఉన్న యజమానులకు అడంగల్‌లో జరిగిన లోపాలు కొరకరాని కొయ్యగా మారాయి. ప్రభుత్వం పట్టించుకోలేదు. అధికారులు సమస్యపై దృష్టి సారించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజా ఫిర్యాదులు పరిష్కారానికి శ్రీకారం చుడితే, ఇందులో అందుతున్న ఫిర్యాదుల్లో ఈ తరహావే 60 శాతం ఉన్నాయంటే సమస్య తీవ్రతకు అద్దంపడుతుంది. ఈ తరుణంలో గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టిపెట్టారు. తప్పు జరిగిన మూలాలనే సరిదిద్దే కార్యక్రమం చేపట్టడంతో రైతుల సమస్య కు పరిష్కారం లభించింది.





తెనాలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భూముల రికార్డులను కంప్యూటరీకరించే సమయంలో జరిగిన పొరపాట్లు రైతుల మెడకు గుదిబండలా మారాయి. రైతులకు అడంగల్‌లోని కాలమ్ నంబరు-6లో జరిగిన లోపాలు కొరకరాని కొయ్యగా మారాయి. అమ్మబోతే ప్రభుత్వ భూమిని నువ్వెట్లా అమ్ముతావని రిజిస్ట్రేషన్ శాఖ తిప్పి పంపితే, పట్టా ఉండి, సర్వ హక్కులూ ఉన్నా ఇదేం ఖర్మంటూ రైతులు ఆవేదన వర్ణనాతీతం. ఇది ఏదో ఒక్క మండలానికో.. గ్రామానికో పరిమితం కాలేదు. రాష్ట్రం మొత్తంమీద ఇదే పరిస్థితి. భూ రికార్డుల కంప్యూటరీకరణ సమయంలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం, త్వరితగతిన పూర్తిచెయ్యాలన్న అప్పటి అధికారుల ఒత్తిడితో రైతుల భూ హక్కులకు ఇబ్బందులు వచ్చిపడ్డాయి. 2012కు ముందు క్రక్స్ అనే సాఫ్ట్‌వేర్‌తో మాన్యువల్‌గా భూ రికార్డులను తయారు చేసేది. 2012లో వెబ్‌లాండ్ సాఫ్ట్‌వేర్ రావడంతో అన్ని రికార్డులను కంప్యూటరీకరించారు. అయితే ఆ సమయంలో అందుబాటులో ఉన్న రికార్డులను ఉన్నవి ఉన్నట్లు ఎక్కించేస్తే, అందుబాటులో లేనివి, ఉన్నా పొరపాటు కారణంగా కాలం నంబరు 6లో తప్పుగా నమోదు చేశారు. ఇక్కడ ప్రభుత్వ భూమా? పట్టా భూమా అని ఉండాల్సి ఉంటే, దాని స్థానంలో రైతులకు అన్ని హక్కులున్నా, ప్రభుత్వ భూమిగా నమోదు చేసేశారు. వైసీపీ సర్కారు వచ్చాక ఇంకొన్ని కావాలనే స్థానిక నేతల ఒత్తిడితో మార్చేశారు. గతంలో ఇలాంటి తప్పులను సవరించడానికి తహసీల్దార్లకు అవకాశం ఉండేది. అయితే దీనివల్లే సమస్యలు ఎక్కువ అవుతున్నాయని తెలిసి కలెక్టర్, జేసీ స్థాయి అధికారి అనుమతి లేకుంటే భూముల రికార్డుల్లో మార్పులకు వీలు లేకుండా లాక్ విధానాన్ని తీసుకొచ్చారు. ఈ క్రమంలో తప్పులను సరిదిద్దండి మహాప్రభో అంటూ వైసీపీ ప్రభుత్వంలో రైతులు చెప్పులరిగేలా కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న నాథుడే లేడు. నంబరు-6 సమస్యకు ఆర్.ఎస్.ఆర్ ఆధారంగా మార్పులు చేసే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా చేసిందేలేదు. పైగా రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకునేందుకు కావాలనే దరఖాస్తులో లోపాలు చూపించి మూడేళ్లగా తిప్పుతూనే వచ్చారు.

సీఎంకు అందిన అర్జీతో.. తెనాలిలో తీగలాగితే

తెనాలికి చెందిన ఖాజాబీ అనే మహిళ తన కుమారుడి ఆరోగ్యం సరిగాలేదని, తనకున్న భూమిని అమ్మితేనే వైద్యం చేయించుకుని బతికించుకోగలని

(మిగతా 8వ పేజీలో..)

త్రిశంకు స్వర్గంలో.. మీ సేవ

- ఆదరణ కోల్పోతున్న కేంద్రాలు
- ఆదాయం లేక ఆపరేటర్ల అవస్థలు
- నడపలేక.. మూసివేయలేక అయోమయం
- దెబ్బతీసిన వైసీపీ ప్రభుత్వం.. కూటమిపైనే ఆశలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

విద్యార్థులకు ధృవీకరణపత్రాలు.. బర్త్, డెత్ సర్టిఫికెట్లు కావాల్సి వస్తే మీ సేవా కేంద్రాలు. ఓటరు కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవాలంటే మీ సేవా కేంద్రాలు. ఇంటి పన్నులు, నీటి పన్నులు, విద్యుత్ బిల్లులు కట్టాలన్నా మీ సేవా కేంద్రాలు.. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ హయాంలో చంద్రబాబు మీ సేవా కేంద్రాలను ప్రవేశపెట్టారు. ప్రజలకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించేలా వీటిని తీర్చిదిద్దారు. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ సేవా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వ ఆదరణ లేక త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అంతంత మాత్రంగా ఉన్న సర్వీసులతో ఆదాయం లేక ఆపరేటర్లు అవస్థలు పడుతున్నారు. అటు నడపలేక, ఇటు మూసివేయలేక అయోమయంలో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మీసేవలను పూర్తిగా దెబ్బతీయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం మీసేవలకు పూర్వ వైభవం తీసుకువస్తుందని ఆపరేటర్లు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు పౌరసేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్, టీసీఎస్ భాగస్వామ్యంలో మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. చంద్రబాబు మొదటి సారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సమయంలోనే దశల వారీగా మీ సేవా కేంద్రాల్లో టెక్నాలజీ ఆధారిత పౌరసేవలు అందుబాటులోకి వచ్చాయి. 2019లో గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాక మీసేవా కేంద్రాల అవసరం తగ్గిపోయింది. మీ సేవా కేంద్రాల నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించడంతో వాటిని కొనసాగించాలని ఆదేశించడంతో కొన్ని చోట్ల అవి కొనసాగుతున్నాయి. 2014-19 వరకు దాదాపు 350 రకాల సేవల్ని మీసేవా కేంద్రాల్లో అందించేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల రాకతో అంతకు ముందు ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాలు మరుగున పడిపోయాయి. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, ఆస్తులు, వ్యవసాయ భూముల కొనుగోళ్లలో మ్యూటేషన్ పత్రాలను కూడా మీ సేవా కేంద్రాల్లో జారీ చేసేవారు. ప్రస్తుతం ఈ తరహా సేవలను రద్దు చేశారు. గతంలో రాష్ట్రంలో ఎక్కడి ఆస్తులకు ఎక్కడైనా ఈసీలు పొందే వెసులుబాటు ఉండేది. సచివాలయాల రాకతో అవన్నీ మాయమయ్యాయి. మీ



(మిగతా 6వ పేజీలో..)



ప్రమాదంలో ధ్వంసమైన లారీలు

3 పది నిమిషాల్లో మూడు లారీలు ఢీ.. ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం

గుంటూరు జిల్లా బుడంపాడు వద్ద ఘోరం

నదిలో మునిగి భార్య మృతి..

- రక్షించే యత్నంలో భర్త గల్లంతు
- సత్రశాల వద్ద కృష్ణానదిలో స్నానానికి దిగిన వేళ విషాద ఘటన

పూరిల్లు దగ్ధం.. వృద్ధుడి సజీవ దహనం

8 సర్‌చార్జికి.. సున్నం



- దారి మళ్లించిన జగన్ ప్రభుత్వం
- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
- స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్, మైనింగ్ రాయల్టీ పెండింగ్
- ఐదేళ్లలో చెల్లింపులు లేకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం

6 బోరుగడ్డకు రాచమర్యాదలపై కొనసాగుతున్న దర్యాప్తు

- మరో కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు రంగం సిద్ధం

బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ప్రణాళిక

- బీసీ భవన్ ఆవరణల్లోనే స్టడీసర్కిల్స్ నిర్మాణం
- చిన్న మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ఆర్థిక చేయూత
- డీఎస్సీ ఉచిత శిక్షణా తరగతుల ప్రారంభ సభలో మంత్రి సవిత

గుంటూరు(విద్య), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, వారి అభ్యున్నతే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తుందని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. గుంటూరు రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించి డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్ని తయారు చేసేందుకు ఆర్థిక చేయూత, ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా యువతకు రుణాలు మంజూరు చేసి వారి స్వయం ఉపాధికి కృషి చేస్తామన్నారు. ప్రతీ జిల్లాలో బీసీ భవన్ నిర్మాణం కోసం ఒకటిన్నర ఎకరాల భూమి సేకరించామని అందులో కొంతభాగంలో స్టడీసర్కిల్ భవనం నిర్మించి నిరుద్యోగ యువతకు వివిధ ఉద్యోగ పరీక్షలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా రాష్ట్రంలో 5720 మందికి డీఎస్సీ శిక్షణ ఇస్తున్నామని, శిక్షణను సమర్థవంతంగా ఉపయోగించుకుని ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలని చెప్పారు. శిక్షణలో నెలకు రూ.1500 స్టయిఫండ్, పుస్తకాలకు రూ.1000 చొప్పున అందిస్తామన్నారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్ ద్వారా ఇచ్చే డీ ఎస్సీ శిక్షణను త్వరలో ఆన్‌లైన్ ద్వారా కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమశాఖ కమిషనర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ త్వరలో స్టడీసర్కిల్స్‌లో సివిల్ సర్వీసెస్‌కు శిక్షణ ఇస్తామన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ డీఎస్సీ శిక్షణకు సమర్థవంతమైన అధ్యాపకుల్ని నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏసురత్నం, ఎమ్మెల్యే నసీర్, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు, జేడీ తనూజారాణి, అదనపు డైరెక్టర్ చంద్రశేఖర్, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ మయూరి తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత, కార్యక్రమానికి హాజరైన డీఎస్సీ అభ్యర్థులు, విద్యార్థులు

ఇళ్ల పట్టాలు.. పునః పరిశీలన

- అర్హులకు అందాయా... వైసీపీ కార్యకర్తలకు ఇచ్చారా అన్న దానిపై ఆరా
- 1.38 లక్షల ఇళ్ల పట్టాలను పరిశీలించనున్న రెవెన్యూ అధికారులు
- అనర్హులకు ఇచ్చి ఉంటే రిమార్కులతో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు



గుంటూరు సమీపంలోని జగనన్న లేఅవుట్

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పథకం పేరుతో గత వైసీపీ ప్రభుత్వంలో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలను పునఃపరిశీలన జరపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేసిం ది. దీంతో జిల్లాలో గుంటూరు, తెనాలి రెవెన్యూ డివిజన్లలో కలిపి పంపిణీ చేసిన లక్షా 38 వేల పైచిలుకు ఇళ్ల పట్టాలను సబ్ కలెక్టర్/ఆర్‌డీవో, తహసీల్దార్లు పునః పరిశీలన చేయనున్నారు. గతంలో పలు పర్యాయాలు ఇళ్ల పట్టాలు పొందిన వారికి కూడా వైసీపీ నాయకుల ఆదేశాల మేరకు అప్పట్లో రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలను మంజూరుచేశారు. నిజమైన పేదవాళ్లలో చాలామందికి అందలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అనర్హుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పథకా న్ని అమలులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం ఆరు అంచెల మూల్యాంకనాన్ని నిర్వహించింది. ఈ పథకంలో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు. పేదలకు ఇళ్ల పట్టా ఆశ చూపి అప్పటి ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడ్డారు.

భూముల సేకరణలోనూ కుంభకోణం

ఇళ్ల పట్టాల కోసం ప్రైవేటు భూములను సేకరించారు. ఈ క్రమంలో భూముల ధరలను అమాంతం పెంచేసి రూ.కోట్ల ప్రభుత్వ సొమ్మును పోగేసుకున్నారు. దీనిపై అప్పట్లో ఎన్ని ఆరోపణలు చేసినా అప్పటి వైసీపీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదు. పైగా అప్పట్లో పని చేసిన అధికారుల్లో కొందరు వారి వాటాలు తీసుకున్నారు. గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో మేడికొండూరు, పెదకాకాని, పెదనందిపాడు, గుంటూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, తాడికొండ, తుళ్లూరు, వట్టిచెరుకూరు మండలాల్లో 2,231.399 ఎకరాలను ప్రభుత్వం వినియోగించింది. ఇందులో 553.855 ఎకరాల ప్రభుత్వ భూమి, 1677.544 ఎకరాల ప్రైవేటు భూమి ఉన్నది. భూసేకరణ కోసం రూ.937.8651 కోట్లు వెచ్చించి 83,313 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. లేఅవుట్ల కోసం వట్టిచెరుకూరు, గుంటూరు, మేడికొండూరు, తాడికొండ, తుళ్లూరులో ఎక్కువ విస్తీర్ణంలో భూములు సేకరించారు. తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలో 1436.727 ఎకరాల భూమిని వినియోగించింది. ఇందులో ప్రభుత్వ భూమి 601.545 ఎకరాలు కాగా ప్రైవేటు భూమి 835.182 ఎకరాలుగా ఉన్నది. ఇందుకోసం రూ.529.1997 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది. ఈ విధంగా జిల్లా మొత్తంగా 2512.726 ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించింది. ఇందుకోసం రూ. 1467.06 కోట్లను ఖర్చు చేసింది.

ఫలితం అంతంత మాత్రమే

గతంలో పేదల ఇళ్ల పేరుతో ఏ ప్రభుత్వం కూడా ఇంత భారీగా నిధులు ఖర్చు చేయలేదు. అయినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు. కొన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లు నివాస ప్రాంతాలకు సుదూరంగా ఉన్నాయి. దీంతో ఆయా లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు పట్టాలు పొందిన వారు ముందుకు రాలేదు. పీఎంఏవై అర్బన్ అనేది బీఎల్‌సీ(బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్) స్థలం ఉన్న వారికి మాత్రమే అమలు చేయాలి. అలాంటిది వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని దీనికి ముడి పెట్టింది. ఐదేళ్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేక చతికిలబడింది. ఈ నేపథ్యంలో అర్హులకు ఇచ్చారా... అనర్హులకు పందేరం చేశారా అనేది తేల్చడానికి ఇళ్ల పట్టాల పునఃపరిశీలన చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

నదిలో మునిగి భార్య మృతి.. రక్షించే యత్నంలో భర్త గల్లంతు



పద్మావతి(ఫైల్)

రెంటచింతల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సత్రశాలలోని కృష్ణానదిలో మునిగి భార్య మృతి చెందగా, ఆమెను రక్షించే యత్నంలో భర్త గల్లంతైయ్యారు. ఆయన ఆచూకీ శనివారం రాత్రి వరకు లభ్యం కాలేదు. ప్రత్యక్ష సాక్షులు, ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తుమ్మ కోట గ్రామానికి చెందిన నీలా సత్యనారాయణ, పద్మావతి దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు అమ్మాయిలకు వివాహం కాగా కుమారుడు గోపి అవివాహితుడు. ఈ కుటుంబం 11 సంవత్సరాల క్రితం రెంటచింతలకు వచ్చి స్థిరపడి మిర్చి వ్యాపారం చేశారు. శనివారం ఉదయం కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న సమయంలో పద్మావతి కాలు జారి నదిలోకి వెళ్లింది. దీనిని గమనించిన భర్త సత్యనారాయణ ఆమెను రక్షించడం కోసం ప్రయత్నించారు. ఈ క్రమంలో సత్యనారాయణ కూడా నదిలో గల్లంతైయ్యారు. పద్మావతి మృతదేహం 100 అడుగుల దూరంలో మత్స్యకారులకు లభ్యమైంది. కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పూరిల్లు దగ్ధం.. వృద్ధుడు సజీవ దహనం



వెంకటేశ్వర్లు(ఫైల్)

సత్తెనపల్లి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పూరిల్లు దగ్ధమై వృద్ధుడు సజీవ దహనమైన సంఘటన మండలంలోని లక్కరాజుగార్లపాడులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పుట్టి వెంకటేశ్వర్లు(80) పూరింట్లో నివసిస్తున్నారు. కుమారులు కూడా అదే గ్రామంలో మరొక గృహంలో నివసిస్తుండగా వెంకటేశ్వర్లు భార్య శాంతమ్మ మూడేళ్ల క్రితం మరణించింది. అప్పటి నుంచి పూరింట్లో ఒంటరిగా ఉంటున్నాడు. రాత్రి సమయంలో పూరింటి నుంచి మంటలు రావటం గమనించిన స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా అప్పటికే గృహాన్ని చుట్టుముట్టాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మంటలను ఆర్పగా వెంకటేశ్వర్లు అప్పటికే పూర్తిగా కాలిపోయాడు. రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

ఆరు చోరీ కేసుల్లో నిందితులకు జైలు

నరసరావుపేట లీగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆరు చోరీ కేసుల్లో నిందితులు పట్టణానికి చెందిన తమ్మిశెట్టి శివ నాగరాజు, మన్నెం రవిలకు ఒక్కొక్కరికి ఒక్కొక్క కేసులో ఏడాది జైలు శిక్ష విధిస్తూ స్థానిక మొదటి అదనపు ఇన్‌చార్జి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆశీర్వాదం పాల్ శనివారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నిందితులు ఇద్దరు వివిధ ప్రాంతాల్లో 16 మోటార్ సైకిళ్లు చోరీ చేశారు. వీటిలో ఐదు మోటరు సైకిళ్లు నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో, ఒక మోటార్ సైకిల్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేశారు. పోలీసులు దర్యాప్తు అనంతరం అభియోగపత్రం దాఖలు చేశారు. నిందితుల వద్ద నుంచి 16 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ లక్ష్మీ రామ్ నాయక్ నిర్వహించారు.

మంత్రి పేరుతో నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్

- ఆ కారుల్లో తిరుగుతున్న వైసీపీ నాయకుడు మహీధర్
- మహీధర్ అరెస్టు.. రెండు కార్లు సీజ్
- రేపల్లె సీఐ మల్లికార్జునరావు

రేపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేరుతో నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్లు పెట్టుకుని కారుల్లో తిరుగుతున్న వైసీపీ నాయకుడు మోర్ల మహీధర్‌ను అరెస్టు చేసి రెండు కార్లు సీజ్ చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇంకో కారును కూడా సీజ్ చేయాల్సి ఉందన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రేపల్లె పట్టణంలోని 3వ వార్డుకు చెందిన దేవగిరి రవిశంకర్‌కు రెండు నెలల క్రితం వెలగపూడి సచివాలయం వద్ద ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మండలం నిడమానూరుకి చెందిన మోర్ల మహీధర్ పరిచయం అయ్యాడు. తనకు మంత్రులు, హైకోర్టు జడ్జీలు బాగా తెలుసని సచివాలయంలో కాంట్రాక్టు ఉద్యోగం ఇప్పించి తరువాత పర్మినెంట్ చేపిస్తానని నమ్మబలికాడు. 14వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో రేపల్లె పట్టణానికి చెందిన రవిశంకర్ ఇంటి వద్దకు టీఎస్09ఈజడ్1133 నంబరు గల ఓల్డు ఫార్చునర్ కారులో వచ్చి డబ్బులు తీసుకుని తనవెంట వస్తే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. సదరు కారుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎమ్మెల్యే స్టిక్కర్ ఉండటంతో రవిశంకర్ గట్టిగా అడిగాడు. దీంతో మహీధర్ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. దీనిపై రవిశంకర్ ఫిర్యాదు మేరకు సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేశారు. విచారణ నిమిత్తం సీఐ ఎన్టీఆర్ జిల్లా నిడమానూరు వెళ్లగా, మూడు కారులకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎమ్మెల్యే నకిలీ స్టిక్కర్ ఉండటాన్ని గుర్తించారు. సీఐను చూసి ఫార్చునర్ 1133కారును పంపించేశారు. టీఎస్07ఈవీ0707 నంబర్‌గల ఓక్స్‌వ్యాగెన్ వైట్‌కారు, ఏపీ23ఎన్9999 నంబర్ గల ఇన్నోవా గ్రీన్ కలర్ కారును స్వాధీనం చేసుకున్నారు. మోర్ల మహీధర్‌ను అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పర్చగా, కోర్టు రిమాండ్ విధించింది.



మాజీ సీఎం జగన్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న వైసీపీ నాయకుడు మోర్ల మహీధర్



పోలీసులు సీజ్ చేసిన నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్ పెట్టుకుని తిరుగుతున్న కారు

వైసీపీ ప్రభుత్వం హయాంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని..

వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి, అప్పటి గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌తో మంచి సాన్నిహిత్యం ఉందని చెప్పి చల్లపల్లి, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, పెనమలూరు, మాచర్ల తదితర ప్రాంతాల వ్యక్తులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలు వరకు వసూలు చేశాడు. ఇప్పటికే ఇతనిపై వివిధ పోలీస్ స్టేషన్‌లలో ఆరు కేసులు నమోదు అయ్యాయి. ఇది ఏడో కేసు. వైసీపీ పాలనలో ఏపీ బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహీధర్ బాధ్యతలు నిర్వహించాడు.

రెండు బైక్‌లు ఢీ... ఒకరు మృతి

- ఇద్దరికి గాయాలు

మాచవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని తురకపాలెం, మాచవరం గ్రామాల మధ్య శనివారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. పిన్నెల్లి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి(27), షేక్ చిన దరియావలి తురకపాలెం నుంచి ద్విచక్ర వాహనంపై మాచవరం వైపు వెళ్తున్నారు. పిన్నెల్లి గ్రామానికి చెందిన క్రాంతి శ్రీను మాచవరం నుంచి ద్విచక్ర వాహనంపై తురకపాలెం వైపు వెళ్తున్నాడు. తురకపాలెం, మాచవరం గ్రామాల మధ్య ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొనటంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. షేక్ మస్తాన్‌వలి, షేక్ చిన దరియావలిలను చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో షేక్ మస్తాన్‌వలి మృతి చెందాడు. షేక్ చిన దరియావలి, క్రాంతి శ్రీనులకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ సతీష్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



మస్తాన్‌వలి(ఫైల్)

ధనుర్మాస వ్రత ఏర్పాట్లను పరిశీలించిన చిన్నజీయర్ స్వామి



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న చిన్నజీయర్ స్వామి

మంగళగిరి సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి బాపూజీ విద్యాలయంలో డిసెంబరు 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ధనుర్మాస వ్రత మహోత్సవ ఏర్పాట్లను త్రిదండి చిన్నజీయర్ స్వామి శనివారం పరిశీలించారు. చాతుర్మాస దీక్ష విరమించి ధనుర్మాస ప్రత్యన్న శ్రీకృష్ణ దీక్ష ప్రారంభం కోసం సీతానగరంలోని విజయకీలాద్రిలో 108 మంది భక్తులకు శ్రీకృష్ణ దీక్షను చిన్నజీయర్ స్వామి ప్రారంభించారు. అనంతరం పెద్దస్వామి వారి ఆశ్రమానికి వెళ్తూ మంగళగిరిలో ధనుర్మాస వ్రత మహోత్సవ ఏర్పాట్లను టెంకాయ కొట్టి ప్రారంభించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, భక్తులకు మంగళ శాసనాలు, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో తులసీరామ్ యాదవ్, వికాస తరంగిణి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో ఊహించని మార్పులు

- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ రత్తయ్య



రాజకుమారి, ముకుందరావు దంపతులను సత్కరిస్తున్న లావు రత్తయ్య, వీరనారాయణ

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో ఊహించని మార్పులు రానున్నాయని, కృత్రిమ మేధ రాజ్యమేలుతుందని విజ్ఞాన్ విద్యా సంస్థల అధిపతి లావు రత్తయ్య చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో శనివారం పావులూరి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదర్శ దంపతుల పురస్కారాన్ని మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, ముకుందరావు దంపతులకు ప్రదానం చేశారు. రావిపాటి వీరనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నేటితరం పిల్లలు సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. అన్ని రంగాల్లో మనుషులతో పని లేకుండా సేవలందే కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవాలంటే ప్రతి విద్యార్థిలోనూ నైపుణ్యాలు పెంపొందాలన్నారు. పెద్దగా చదువుకోకపోయినా రాజకీయ రంగంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన రాజకుమారి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరిన ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను పూజించిన వారేనని ఉదహరించారు. బిడ్డల కోసం తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడితే వృద్ధాప్యంలో వారిని ఆదరించే పరిస్థితులు సమాజంలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. ట్రస్టు కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రులు నిరాదరణకు గురవుతుండటం బాధించిందని, అందుకే ఆదర్శ దంపతుల పురస్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో నన్నపనేని సుధాకర్, గుత్తా వెంకటరత్నం, రామరాజు, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్రిశంకు స్వర్గంలో.. మీ సేవ

(5పేజీ తరువాయి)

సేవల్లో రద్దయిన సేవలను సచివాలయాల్లో అందిస్తున్నారా అంటే అది కూడా లేదు. దీంతో ప్రజలు తిరిగి మీ సేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు చేయాల్సిన ఉద్యోగాలు, విధులపై జాబ్ ఛార్ట్‌ను ఖరారు చేయకపోవడమే ఈ రకమైన సమస్యకు కారణం అవుతోంది. సచివాలయాల్లో జారీ చేసే ధృవీకరణ పత్రాల విషయంలో మరో సాంకేతిక సమస్య ఎదురవుతోంది. మీ సేవా కేంద్రాల్లో నిర్ణీత రుసుము చెల్లిస్తే ఎన్ని కాపీలైనా ప్రింట్ చేసే అవకాశం ఉంటుంది. సచివాలయాల్లో ప్రస్తుతం డిజిటల్ కాపీలను మాత్రమే జారీ చేస్తున్నారు. క్యాస్ట్, ఇన్‌కమ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వంటి వాటికి ఒక్క కాపీ మాత్రమే మంజూరు చేస్తున్నారు. సచివాలయాల్లో జారీ చేసే డిజిటల్ కాపీలను మీ సేవా కేంద్రాల్లో ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారు. పీడీఎఫ్ కాపీలకు ఎవరైనా నకిలీ పత్రాలను సృష్టిస్తే తాము చిక్కుల్లో పడతామని, సచివాలయాలు జారీ చేసే పత్రాలను ముద్రించడానికి మీ సేవా కేంద్రాలు నిరాకరిస్తున్నాయి. సచివాలయాలు, మీ సేవా కేంద్రాల మధ్య నెలకొన్న గందరగోళంతో అర్జీదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, యువగళం పాదయాత్రలో లోకేశ్ గత ఎన్నికలకు ముందు కలిసిన ఆపరేటర్లకు మీ సేవలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో మీసేవలపై పట్టున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వాటికి పూర్వవైభవం తెస్తారని భావిస్తున్నారు.

అన్ని వేళాలా అందుబాట్లో సేవలు

మీ సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉండేవి. ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మీ సేవా కేంద్రాలు నిర్విరామంగా పని చేస్తుండేవి. దీంతో వివిధ రకాల సర్టిఫికెట్లు, పన్నులు, వివిధ రకాల బిల్లుల చెల్లింపులకు ఈ కేంద్రాలు ప్రజలకు సౌకర్యంగా ఉండేవి. అనేక ఏళ్లపాటు ప్రజలకు సేవలందించిన మీ సేవ

- ఆదరణ కోల్పోతున్న కేంద్రాలు

లకు వ్యతిరేకంగా వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. సచివాలయాలు ఏర్పడిన తొలినాళ్లలో మీ సేవా కేంద్రాల్లో ఇచ్చిన సర్టిఫికెట్లు చెల్లవని, అధికారులు కూడా సచివాలయాలను ప్రోత్సహిస్తూ వచ్చారు. అప్పటి ప్రభుత్వం కూడా మీసేవా కేంద్రాలను పరిగణనలోకి తీసుకోరాదని హెచ్చరించడంతో అధికారులు కూడా మీసేవలను దూరం పెట్టారు. దీంతో మీ సేవలకు ప్రజలు కూడా దూరమయ్యారు. ఈ క్రమంలో మీసేవా కేంద్రాల పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్థిక ఇక్కట్లతో కొందరు కేంద్రాలను నడపలేక మూసివేశారు. సచివాలయాలలో సేవలు ఉన్నా అవి ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల వరకే అందుబాటులో ఉంటాయి. ఈ కారణంగా వివిధ పనులు, ఉద్యోగాలకు వెళ్లే వారికి ఆశించిన విధంగా సచివాలయాల సేవలు ఉపయోగపడడం లేదనే విమర్శలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలు అందించడం లేదనే ఆరోపణలున్నాయి.

పౌర సేవల్లో అంతులేని నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రతిష్ఠాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సుపరిపాలన నినాదంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసినా పౌర సేవల్లో అంతులేని నిర్లక్ష్యం ఉంది. సచివాలయాల సిబ్బందిలో జవాబుదారీతనం తీసుకురాకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి. దశల వారీగా 500కుపైగా పౌరసేవల్ని సచివాలయాల్లో అందిస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం అమలులో చతికిల పడింది. రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాలు, విద్యుత్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వంటి సేవల్ని అందిస్తామన్నా ఆయా శాఖల నుంచి అధికారాలను మాత్రం సచివాలయాలకు బదలాయించలేదు. సాంకేతికంగా చెప్పాలంటే సచివాలయ సిబ్బందికి ఎలాంటి అధికారాలు లేవు. కేవలం దరఖాస్తుల్ని ప్రాసెస్ చేయడానికి మాత్రమే వారు పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వంలో ఇంటింటికి పెన్షన్ల పంపిణీకే సిబ్బంది పరిమితమయ్యారన్న వాదన ఉంది.

బోరుగడ్డకు రాచమర్యాదలపై కొనసాగుతున్న దర్యాప్తు

- మరో కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు రంగం సిద్ధం

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌కు అరండల్‌పేట పోలీస్ స్టేషన్లో రాచమర్యాదలు చేసిన ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతుంది. కస్టడీలో ఉన్న బోరుగడ్డకు రాచమర్యాదలు కల్పించిన వ్యవహారంపై ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు విచారణ జరిపి ఎస్పీ సతీష్ కుమార్‌కు నివేదిక అందించారు. పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరా ఫుటేజీ లీకేజీ వ్యవహారంపై జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ రమణమూర్తి విచారణ జరిపి జిల్లా ఎస్పీకి నివేదిక అందజేశారు. అరండల్‌పేట స్టేషన్‌లో రాచమర్యాదలు కల్పించిన వ్యవహారంపై ఇప్పటికే నలుగురు కానిస్టేబుళ్లపైనా, రెస్టారెంట్‌కు తీసుకువెళ్లిన వ్యవహారంలో ఏడుగురిపైనా వెరసి 11 మందిపై సస్పెన్షన్ వేటు విధించిన విషయం తెలిసిందే. సీసీ కెమెరా ఫుటేజీ లీకేజీ కేసులో ప్రైవేటు టెక్నీషియన్ శేషను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. ఇదే కేసులో ఓ పత్రికా విలేకరి, మరో ఛానల్ కెమెరామన్ కూడా నిందితులుగా ఉన్నారు. విలేకరి అజ్ఞాతంలో ఉండగా, కెమెరామన్‌కు నోటీసు జారీ చేశారు. ఈ కేసులో అదనపు ఎస్పీ రమణమూర్తి జరిపిన దర్యాప్తులో ఓ కానిస్టేబుల్ పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. ఆ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు విధించే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో పోలీసు అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. సంబంధిత డీఎస్పీ, సీఐలకు ఛార్జిమెమోలు ఇచ్చే అవకాశం ఉంది.

డేటా లీకేజీపై కలవరం..

అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ప్రైవేటు టెక్నీషియన్ శేషు డేటా చౌర్యానికి పాల్పడినట్లు వెలుగు చూడడంతో అనేక మందిలో ప్రస్తుతం కలవరం మొదలైంది. ఆయన అనేక పోలీస్ స్టేషన్‌లతో పాటు కార్యాలయాలు, పలువురు ఇళ్లలో సీసీ కెమెరాలు అమర్చారు. ఆయా కెమెరాలకు సంబంధించిన పాస్వర్డ్ సంబంధిత వ్యక్తులకు ఇవ్వడంతోపాటు తన వద్ద ఉంచుకుని యాక్సెస్ చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తద్వారా ఎవరెవరి వీడియోలు చూశాడనేది ప్రస్తుతం వారిలో ఆందోళన కలిగిస్తుంది. ఆయా వీడియోల ఆధారంగా బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజినట్లు సమాచారం. డేటా చౌర్యానికి సంబంధించి మొత్తం వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూసినట్లు సమాచారం.

నేటి నుంచి అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ జి.కరుణసాగర్

బాపట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2024-2025 వార్షిక రెండో దశ అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఈనెల 17వ తేదీ నుంచి బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రారంభం కానున్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ జి.కరుణసాగర్ తెలిపారు. ఈ విషయమై కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణితో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన 19 అనుబంధ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారన్నారు. 20వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు 612 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. విద్యార్థినీలకు ప్రత్యేకంగా క్రీడాపోటీలు జరుగుతాయని వివరించారు. 17వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలకు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసూనా రాణి తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్ పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం.సురేష్‌కుమార్, డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ టి.ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

మేయర్ మనోహర్ నాయుడుపై కేసు నమోదు

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాడు అధికారం మదంతో లాఠీ చేత పట్టి టీడీపీ కార్యకర్తలపై దాడి చేయడమే గాక నోరు పారేసుకున్న మేయర్ కావటి మనోహర్ నాయుడుపై స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. అరం డల్‌పేట ఎస్సై రోజాలత చెప్పిన వివరాల ప్రకారం వైసీపీ హయాంలో టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలో భాగంగా గుంటూరు నగరంలోనూ టీడీపీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఇందులో భాగంగా గత ఏడాది అక్టోబరు 9న గుంటూరు నగరంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు నిరసన తెలి పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వ కార్యదర్శి కనపర్తి శ్రీని వాసరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుండగా అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తన అను చరులతో వస్తూ పోలీసుల చేతుల్లో ఉన్న లాఠీని గుంజుకొని టీడీపీ కార్యకర్తలను వెంట పడి కొట్టారు. అరండల్ పేట పోలీస్ స్టేషన్ ముందుకు వచ్చి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లపై దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఆయా వ్యాఖ్యలు మీడి యాలో ప్రసారం కావడమే కాకుండా స్వయంగా మేయరే వైసీపీ గ్రూపులో పోస్ట్ చేశారు. ఈ విషయమై అదే రోజు అరండల్ పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని, ఇప్పటికైనా మేయర్‌పై చట్ట ప్రకారం తగు చర్యలు తీసు కోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వ కార్యదర్శి కనపర్తి శ్రీనివాస రావు అరండల్‌పేట పోలీసులకు ఇటీవల ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్య లతో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు దేశం పార్టీ అభి మానులు, కార్యకర్తలు తీవ్ర మనస్తాపానికి గురయ్యారని, తమ నాయకుల పరువుకు భంగం వాటిల్లిందనిఅ ఫిర్యాదులో తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీరెడ్డిపై గుంటూరులో కేసు నమోదు

నోరు తెరిస్తే బూతులు అసభ్యకర మాట లతో గడచిన ఐదేళ్లు రెచ్చిపోయిన జూనియర్ ఆర్టిస్టుగా చెప్పుకునే వైసీపీ నాయకురాలు శ్రీరెడ్డిపై స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అండ చూసు కుని శ్రీరెడ్డి నాటి ప్రతిపక్ష నేత నారా చంద్ర బాబు నాయుడు, పవన్ కల్యాణ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, లోకేశ్, మంత్రి వంగలపూడి అనిత తదితరులపై నోటికొచ్చినట్లు అసభ్యకరంగా మాట్లాడారని గుంటూరు పశ్చిమ నియోజక వర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ దాసరి జ్యోతి నగరంపాలెం పోలీ సులకు ఫిర్యాదు చేశారు. లేనివి ఉన్నట్లు నమ్మించేలా తప్పుడు ప్రచారం చేశారని, వారి గౌరవ మర్యాదలకు భంగం కలిగే విధంగా దూషిస్తూ వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద శ్రీరెడ్డిపై కేసు నమోదు చేశారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

వైసీపీ నాయకుడు, కార్పొరేటర్ దివంగత పాదర్తి రమేష్ గాంధీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని అదే పేరు కలిగిన రౌడీ షీటర్ పేరుతో కోర్టులో అంద జేసిన కేసులో పట్టాభి పురం కోర్టు కానిస్టేబుల్ కే రాజుపై స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమో దైంది. కాగా, ఈ విషయం బయటకు పొక్క డంతో కానిస్టేబుల్ రాజును సస్పెండ్ చేస్తూ ఎస్పీ సతీష్ కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ విషయం కోర్టు దృష్టికి వెళ్లడంతో కానిస్టేబుల్ రాజు పై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా నగరం పాలెం పోలీసులను ఆదేశించింది. ఈ నేప థ్యంలో రాజుపై కేసు నమోదైంది.

కాలువలో పసికందు మృతదేహం



పసికందు మృతదేహాన్ని మార్చురీకి తరలిస్తున్న రుద్ర చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు

నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నూరు రహదారి బుడంపాడు కాలువ కల్వర్టు దగ్గర పసి కందు మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు సమాచారం అందుకున్న నల్ల పాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నీటిలో కొట్టుకు వచ్చిందా లేక ఎవరైనా తెచ్చి ఇక్కడ పడ వేశారా అనే అను మానాలు వ్యక్తమవ ుతున్నాయి. మృతదేహాన్ని రుద్రా ట్రస్ట్ ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఐక్య పోరుతోనే విద్యుత్ కార్మికుల హక్కుల సాధన

గుంటూరు(తూర్పు), నవంబరు 16(ఆంధ్ర జ్యోతి): విద్యుత్ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అవలంభిస్తున్న వ్యతిరేఖ విధానాలపై ఐక్య పోరు సాగించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు పిలుపు నిచ్చారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో 'ప్రభుత్వ విధానాలు, విద్యుత్ రం గం సవాళ్లు' అనే అంశంపై శనివారం రాష్ట్ర సదస్సు జరిగింది. విద్యుత్ కార్మికుల సమస్యల పరి ష్కారం కోసం ఈ నెల 20న 'సామూ హిక రాయబారాలు' కార్యక్రమం నిర్వహిస్తు న్నట్టు ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్య కమంలో జె రాజ శేఖర్, ఏపీ నాగేశ్వరరావు, ముజఫర్ అహ్మద్ తదితరులు పాలొన్నారు.

'నరేంద్రకు మంత్రి పదవి ఇవ్వండి'

గుంటూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమా ర్‌కు న్యాయం చేయాలని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి టీడీపీ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి 2004 ఎన్ని కల్లో జయకేతనం ఎగరవేసిన ఒకే ఒక్కడిగా చరిత్ర సృష్టించిన టీడీపీ యోధుడు నరేంద్ర ప్రతిపక్షంలో వున్న రెండు సార్లు చంద్ర బాబుకు కుడిభుజంగా నిలిచారని గుర్తు చేశారు. పార్టీ సంక్షోభంలో కూరుకుపోయినా, దాడులకు వెరువక, వెనుకంజ వేయక, పక్క చూపులు చూడకుండా పోరాడిన నరేంద్రకు ఈ ప్రభుత్వంలో క్యాబినెట్ స్థాయి పదవులే కరువయ్యాయా అని ఆవేదన వ్యక్తం చేశారు.

బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా చూడాలి

● జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్



రహదారి భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన రహదారులపై ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్‌ల వద్ద అవసరమైన చర్యలతో పాటు మరమ్మ తులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో రహదారి భద్రత, ప్రమాదాల నివారణకు సంబంధించిన అంశా లకు సంబంధిత శాఖలు అత్య ధిక ప్రాధాన్య మివ్వాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణ కోసం చర్చించిన అంశాలపై ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, పంచాయితీ ఇంజనీరింగ్, పోలీస్, మున్సిపల్, వైద్యారోగ్య శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించి తదుపరి సమా వేశం నాటికి తీసుకున్న చర్యలపై నివేదికను కచ్చితంగా అందజేయాలని అన్నారు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు తక్షణ వైద్యసాయం అందించేలా చర్యలు తీసుకోవా లన్నారు. నేషనల్ హైవేపై ద్విచక్ర వాహనాలు, ఆటో రిక్షాలు మెయిన్ క్యారేజ్‌పై తిరగకుండా సర్వీస్ రోడ్‌లో మాత్రమే తిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవేపై ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌తోనే ప్రయాణించే విధంగా నిబంధనలు అమలు చేయాలన్నారు. నేషనల్ హైవేపై ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎవరైనా సరే అత్యవసర సహాయం కోసం నేషనల్ హైవే అథారిటీ హెల్ప్ లైన్ నంబర్ '1033'కు కాల్ చేయాలన్నారు. రహదారి భద్రత అవగాహన సదస్సులు నిర్వహించేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు నగరంలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్ అన్నింటిని త్వరితగతిన మరమ్మతులు చేసి వాటన్నింటిని కూడా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు వీలుగా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కాజా గ్రామం దగ్గర కృష్ణ మందిరం సమీపంలో నేషనల్ హైవే సర్వీస్ రోడ్ విస్తరణ కోసం స్థలసేకరణకు సంబంధించిన పనిని వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రితో పాటుగా ప్రైవేట్ హాస్పిటల్స్‌ని కూడా జాబితాలో నమోదు చేసేలా అధి కారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాల్లో వ్యాపార సంస్థల ముందు, రహదారులపై వాహనాలు పార్కింగ్ చేయకుండా నియంత్రించాలన్నారు. భవ నాల సెల్లార్లో వాహనాలు పార్కింగ్ చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఆర్ అండ్ బీ ఎస్ఈ సీతారామమూర్తి, డీటీసీ కే సీతారామిరెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, పంచాయితీ రాజ్ ఎస్ఈ జీ బ్రహ్మయ్య, జాతీయ రహదారులు పీడీ టీ పార్వతీశం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కే విజయలక్ష్మి, ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనే జర్ రవికాంత్ , ఎన్జీవో సుదీక్షణ ఫౌండేషన్ ప్రతినిధి ఆర్ రాజకుమారి, నగర పాలక సంస్థ ఎస్ఈ కేనాగమల్లేశ్వర రావు, సిటి ప్లానర్ డీ రాంబాబు పాల్గొన్నారు.

ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు ఉండాలి

● టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించిన జీఎంసీ కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ అనుమతించిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు ఉండాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీని వాసులు పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. రోజువారీ పర్యటనలో భాగంగా శనివారం ఉదయం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు తనిఖీల నిమిత్తం స్థానిక శ్యామలానగర్, బృందావన్‌గార్డెన్స్, రెడ్డిపాలెం ప్రాంతాల్లో పర్యటించి, నిబం ధనల ప్రకారం అనుమతించిన భవన నిర్మాణాలు ఉన్నదీ లేనిది తనిఖీ చేశారు. అపార్టుమెంట్ల వద్ద ర్యాంపులు రోడ్లపైకి, డ్రెయిన్లపైకి ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్ నుండి చేబ్రోలు హనుమయ్య కంపెనీ వరకు పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పర్యటించారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లో తొలగించిన తోపుడు బండ్ల వీధి వ్యాపా రులకు హాకర్ వెండింగ్ జోన్స్, వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ మానం పద్మశ్రీ, సిటీ ప్లానర్ రాంబాబు, ఎ.సి.పి రహ మాన్, టి.పి.యస్ సత్యనారాయణ, డీఈఈలు, ఏఈలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి పైపులైన్ లీకేజ్ పనులను పరిశీలించిన కమిషనర్

స్థానిక సంజీవయ్య నగర్‌లో జరుగుతున్న ప్రధాన పైపు లైన్ లీకేజ్ మరమ్మతులను శుక్రవారం అర్ధరాత్రి జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు పరిశీలించారు. లీకేజీ వివ రాలను ఇంజనీరింగ్ అధికారు లను అడిగి తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపాది కన రెండు లీకేజ్‌లను పూర్తి చేయాలని ఆదేశించారు.

గుర్తింపుకార్డుల కోసం వీధి వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలి

నగరంలోని వీధి వ్యాపారులు గుర్తింపుకార్డు కోసం దరఖాస్తు చేసు కునేం దుకు సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, నగర పాలక సంస్థ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ప్రతి ఒక్క తోపుడు బండి వీధి వ్యాపారి గుర్తింపు కార్డు కోసం నగర పాలక సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నగరంలోని ప్రతి ప్రధాన రహదారిపై, డ్రెయిన్లపై చిరు వ్యాపారులు నిర్వహిస్తూ అడ్డంకిగా ఉన్నారని, వాటిని దశలవారీగా తొలగించడం జరుగుతుందని తెలిపారు. తొలగించిన ప్రాంతాల్లో వీధి వ్యాపారులకు జీఎంసీ ద్వారా గుర్తింపు కార్డు అందించడానికి ఈ నెల 18 ఉదయం నుండి నగర పాలక సంస్థలో, స్థానిక బృందవాన్ గార్డెన్స్ లోని సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగర పాలక సంస్థ గుర్తింపు కార్డు ఉన్నవారు, లేని వారు విధిగా అందరూ తమ వ్యక్తిగత ఫొటో (వ్యాపారం చేయుచున్న పాస్ పోర్ట్ ఫొటో), కుటుంబ సభ్యుల ఫొటో (14 సంవత్సరాలు మించిన వారు మాత్రమే), డిక్లరేషన్ పత్రం, నివాస పత్ర ఆధారం, గతంలో స్ట్రీట్ వెండర్ గుర్తింపు కార్డు నకలు, నగర పాలక సంస్థ జారీ చేసి గుర్తింపు కార్డు నకలు, ఆధార్ కార్డు, అర్జీదారుని ఫోన్ నంబర్, బ్యాంకు అకౌంట్ నకలుతో అర్జీలను పూర్తి చేసి సమర్పించాని వివరించారు. అర్జీలను స్క్రూటీని చేసి, శాశ్వత గుర్తింపు కార్డులను వీలైనంత త్వరలో మంజూరు చేస్తామని, వీటి ఆధారంగా జోన్ల కేటాయింపు చేపడ తామని అన్నారు. నగర పాలక సంస్థ స్ట్రీట్ వెండింగ్ జోన్లు డిసెంబర్ 10 నాటికి ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రధాన రోడ్లు, డ్రెయి న్లను ఆక్రమించకుండా డ్రెయిన్ వెనుకవైపు వ్యాపారాలు చేసుకోవాలని తెలిపారు.

వీధి పశువులను బందెల దొడ్డికి తరలిస్తాం



పశువుల యజమానులతో జరిగిన సమావేశంలో కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తదితరులు

గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని వీధులలో తిరిగే ఆవులు, దూడలు, గేదెలు, ఎద్దుల నియంత్రణ కోసం ప్రతీ రోజు రెండు వాహనాలలో వాటిని వెంగళాయ పాలెంలో నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన గోశాలకు(బందెలదొడ్డి)కి తరలిస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలి పారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి శనివారం పశు వుల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో 4 ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి వీధుల్లో తిరిగే పశువులను బందెల దొడ్డికి తరలిస్తామని చెప్పారు.ప్రభుత్వ పశు వైద్య జాయింట్ డైరక్టర్, డిప్యూటీ డైరక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వీధులలో సంచరిస్తున్న జంతువులకు లంప్ స్కిన్ అనే వైరస్ ఉందని, మరణాలు సంభవిస్తాయని వాటికి ఉచితంగా వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వెటర్నరీ వైద్యాధికారులు, నగర పాలక సంస్థ సి.యస్.హెచ్.ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు.

కెటిల్‌బెల్ స్పోర్ట్స్‌లో జావీద్‌కు కాంస్య పతకం



ఎండీ జావీద్ అహ్మద్

గుంటూరు మెడికల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ కెటిల్‌బెల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పూణేలో నవంబరు 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన ఆసియా, ఓషి యానియా కెటిల్ బెల్ చాంపియన్ షిప్ పోటీల్లో గుంటూరుకు చెందిన ఎండీ జావీద్ అహ్మద్ పాల్గొని కాంస్య పతకాన్ని సాధించినట్లు ఏపీ గిరేవోయ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ రాఘవశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జావీద్ అహ్మద్ వన్ ఆర్మ్ లాంగ్ సైకిల్ (24 కేజీల విభాగం) కెటిల్ బెల్ 10 నిమిషాల ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించినట్లు ఆయన వివరించారు.

డిసెంబరు 29న లక్ష హనుమాన్ చాలీసా ఏకాసన పారాయణం

గుంటూరు(తూర్పు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, పాటి బండ్ల సీతారామయ్య హైస్కూల్ ప్రాంగ ణంలో డిసెంబరు 29న మధ్యాహ్నం 3 నుంచి లక్ష హనుమాన్ చాలీసా ఏకాసన పారా యణం జరుగుతుందని నిర్వాహకులు జూపి టర్ ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పారాయణంలో పాల్గొన దలచిన వారు తమ పేర్లను "డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు. జైహనుమాన్. సీవో. ఇన్" అనే వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 8297711666 నంబరులో సంప్రదించాలని సూచించారు.

జన చైతన్య వేదిక కార్యాలయాన్ని సందర్శించిన డాక్టర్ పొదిలి ప్రసాద్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక జనచైతన్య వేదిక కార్యాలయాన్ని డాక్టర్ పొదిలి ప్రసాద్ శనివారం సందర్శించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు గాను సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణం కోసం పదిహేనేళ్ల క్రితమే రూ.5 కోట్ల విరాళం అందించి తన దాతృత్వాన్ని చాటు కున్న డాక్టర్ పొదిలి ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడారు.

సమర్ధవంతమైన విధి నిర్వహణకు కవాతు, క్రమశిక్షణ



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులు సమర్ధవంతంగా విధులు నిర్వహించా లంటే కవాతు, క్రమశిక్షణ అవసరమని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు ఆధ్వర్యంలో జరిగిన పోలీస్ కవాతును ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కవాతుతో క్రమ శిక్షణ అలవడుతుందని, తద్వార సక్రమమైన విధి నిర్వహణ సాధ్యమవుతుందని అన్నారు. శాంతి భద్రతల సమస్యలు, అల్లర్లు, మతపరమైన గొడవలు, బందోబస్తుల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కొన్ని సార్లు ఎంతో శ్రమించాల్సి ఉంటుందని, శారీరక దృఢత్వం, ఓర్పు, సహనం ఉంటేనే ఇది సాధ్యమని అన్నారు. తొలుత కవాతు పరేడ్ కమాండర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సూర్య భాస్కర్ పోలీస్ కవాతు తరఫున ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. కవాతులో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీస్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ బలగాలు పాల్గొన్నాయి. అనంతరం ఎస్పీ పోలీస్ పరేడ్ గ్రౌండ్ పక్కనే ఉన్న స్పెషల్ టాస్క్ ఫోర్స్ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందితో మాట్లాడి, విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, వారి అవసరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన విధి నిర్వహణ కోసం అవసరమైన సౌకర్యాల కల్పన గురించి సమీక్షించారు. జిల్లాకు స్పెషల్ టాస్క్ ఫోర్స్ విభాగం సేవలు ఎంతో విలువైనవని అన్నారు.ఎస్టిఎఫ్ సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఆర్ఐ లు సూర్య భాస్కర్, శ్రీహరి రెడ్డి , శివరామకృష్ణ పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మరణించిన పోలీస్ కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. జిల్లాలో వివిద కారణాలతో మృతి చెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు స్థానిక జిల్లా పోలీస్ కార్యా లయంలో శనివారం చెక్కులు అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందించేందుకు చేయూత పథకం, విడో ఫండ్, ఫ్లాగ్ ఫండ్ చెక్కులను అందజేశారు. గత నెలలో అనారోగ్య కారణాల వలన మరణించిన తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్సై అరుణాచలం, జిల్లా పోలీస్ యూనిట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఏఆర్ఎస్సై మాణిక్యరావు కుటుంబసభ్యులకు ఆయా చెక్కులు అందించారు. ఒక్కో కుటుంబానికి రూ. లక్ష చొప్పున, పోలీస్ కార్యాలయం తరఫున ఫ్లాగ్ ఫండ్ కింద రూ.25 వేలు, విడో ఫండ్ కింద రూ.50 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వరరావు, జిల్లా పోలీస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ లక్ష్మయ్య , ట్రెజరర్ హుస్సేన్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ శివప్రసాద్, వెనుక నిందితులు

డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్

● 15 గ్రాములు స్వాధీనం

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరు రోడ్డు వద్ద ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డు చివర డ్రగ్స్‌ని పంచుకుంటున్న ముగ్గురు సభ్యులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు.లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, లాలాపేట సీఐ ఏవి శివప్రసాద్ తదితరులు నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం పిడుగురాళ్ల యానాది కాలనీలో ఉంటున్న గుంటూరులోని వడ్డెర గూడెం రెండవ లైన్‌కి చెందిన షేక్ గౌస్ బాషా అలియాస్ బాస్, నెహ్రూ నగర్ రాములువారి గుడి ప్రాంతానికి చెందిన పఠాన్ మున్నా, అరుంధతినగర్ లోని వెంకటేశ్వర స్వామి గుడి ప్రాంతానికి చెందిన ముక్కంటి రాము అలియాస్ రవి తదితరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 15 గ్రాముల ఎంఈటిహెచ్ (ఎండిఎం) పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ముగ్గురు నిందితులు బెంగళూరు నుంచి ఈ పౌడర్ ను తెప్పించి మూడు సమాన ప్యాకెట్లుగా చేసి వాటిని విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం రూపొం దించారు. ఒక్కో ప్యాకెట్ కు ఐదు గ్రాములు చొప్పున ముగ్గురు మూడు ప్యాకెట్లలో నింపుతుండగా పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను వారిని అరెస్టు చేసినట్లు చెప్పారు. డ్రగ్స్‌తో పాటు వారి వద్ద లైటర్, అదేవిధంగా డ్రగ్స్ సేవించేందుకు ఉపయోగించే పైప్టర్ ఎక్స్ గాజు గొట్టం స్వాధీనం చేసుకున్నారు.

ఏడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జిల నియామకం

● గుంటూరు 'తూర్పు'కు మస్తాన్‌వలి, 'పశ్చిమ'కు జాన్‌బాబు

గుంటూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విభజిత గుంటూరు జిల్లాలోని ఏడు నియో జకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిలను నియ మిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఆయా నియోజక వర్గాల్లో పార్టీ శ్రేణు లతో సభలు, సమావేశాలు నిర్వహించి పార్టీలో పునరుత్తేజం కల్పించాలని సూచించారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న చిలకా విజయ్‌కుమార్‌ను తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. గుం టూరు తూర్పు నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలిని, పశ్చిమ నియోజకవర్గానికి రాచకొండ జాన్‌బాబును, తెనాలికి డాక్టర్ చందు సాంబశివుడు, పొన్నూరుకు గాదె నాగేశ్వరరావు, ప్రత్తిపాడుకు కొరివి వినయ్‌కుమార్, మంగళగిరికి షేక్ సలీమ్‌లను ఇన్‌చార్జిలుగా నియమించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీభవన్‌లో శని వారం జరిగిన కార్యక్రమంలో పార్టీ ఇన్‌ఛార్జ్ శ్రీపతి ప్రకాశం, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్‌లు ఇన్‌చార్జిలకు అభినందనలు తెలియజేశారు.

రామోజీరావుకు ఘన నివాళి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ లో రామోజీ గ్రూపు సంస్థలను పటిష్ట పరిచి 25 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 25 వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించిన రామోజీరావు నిబద్ధత, నిజాయితీకి నిలువుటద్దమని జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటి రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కొనియాడారు. రామోజీ రావు 88వ జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు.

మిర్చియార్డులో అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు

● 'ఆంధ్రజ్యోతి'తో ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆంజనేయులు



గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కొన్ని వ్యవస్థలు గాడి తప్పాయి. ఈ కారణంగా అక్రమాలు జరుగుతున్నాయి. వాటన్నింటికి అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన చర్యలను పర్సన్ ఇన్‌ఛార్జ్, జాయింట్ కలెక్టర్ భార్గవతేజ సూచనల మేరకు అమలు చేస్తా మని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. రెండు రోజుల క్రితం వివిధ వర్గాలతో పర్సన్ ఇన్‌చార్జి, సెక్రెటరీ సమావేశమై చర్చిం చారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అడిగిన ప్రశ్నలకు ఉన్నతశ్రేణి కార్యదర్శి జవాబులు...

యార్డులో సిబ్బందిని ఎలా గాడిన పెట్టబోతున్నారు?

కార్యదర్శి: మిర్చి సీజన్‌లో పని భారం కారణంగా గత పాలకవర్గాలు డిప్యూటేషన్‌పై ఇతర కమిటీల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకొచ్చాయి.



అయితే వారిలో చాలామంది సీజన్ అయిపోయినా వెనక్కు వెళ్లిపోకుండా అలాగే కొన సాగుతున్నారు. పైగా ఫలాన సీటు అయితేనే పని చేస్తా మంటున్నారు. దీని దృష్ట్యా అవసరం లేని వారిని వెనక్కు పంపేస్తాం.

వేమెన్‌లతో ఏమి చర్చించారు?

కార్యదర్శి: వేమెన్‌లకు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ ఉండాలని చెప్పాం. అలానే ఐడీ కార్డులు ధరించి యార్డులోని అన్ని దుకాణాలు, కోల్డ్‌స్టోరేజ్‌లకు కాటా తీసుకొని వెళ్లి మిర్చి టిక్కీలు తూకం వేయాలని ఆదేశించడం జరిగింది. ఎప్పుడో జారీ చేసిన లైసెన్సుల్లో కొన్ని చేతులు మారినట్లు మా దృష్టికి వచ్చింది. వాటిని పరిశీలించబోతున్నాం.

జీరో, బిల్ టూ బిల్, కటింగ్ వ్యాపారాల వలన యార్డుకు జరుగుతున్న నష్టాన్ని ఎలా అరికడతారు?

కార్యదర్శి: దీనిపై ఆది/సోమవారాల్లో పర్సన్ ఇన్‌చార్జితో చర్చిస్తా. ఈ విషయంలో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

మిర్చి రైతులకు ఏమి భరోసా ఇవ్వబోతున్నారు?

కార్యదర్శి: మిర్చి సీజన్ మరో నెలలో ప్రారంభం అవుతుంది. ఇందుకోసం అవసరమైన సదుపాయాలన్ని యార్డులో కల్పిస్తున్నాం. రాత్రివేళ చోరీలు జరగ కుండా ఉండేందుకు లైటింగ్‌ని మెరుగుపరుస్తాం. మార్కెటింగ్ శాఖ నిర్ణ యించిన చార్జీలనే కమీషన్ వ్యాపారస్తులు, హమాలీలు వసూలు చేసేలా చూస్తాం. రైతులను ఎవరైనా మోసగించాలని చూస్తే కఠిన చర్యలు చేపడతాం.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకే సైన్స్ ప్రదర్శనలు

● కేఎల్‌పీ స్కూల్ కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు నవీన్

గుంటూరు(విద్య),నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మక తను వెలికితీసేందుకు సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయని కేఎల్‌పీ స్కూల్ కార్య దర్శి డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈనెల 11, 12తేదీల్లో విజయ వాడ నలంద విద్యానికేతన్‌లో సీబీఎస్ఈ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినన సైన్స్ ప్రద ర్శనలో కెఎల్‌పి స్కూల్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు మొదటి బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ఆయన మాట్లాడారు. సెన్సార్స్‌మైక్రో కంట్రోలర్స్ ఉపయోగించి ఊహించన వర్షాల నుంచి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా వరి పం టలను రక్షించే అంశంపై విద్యార్థులు ప్రదర్శన ఏర్పాటు చేశారని తెలిపారు. తమ విద్యార్థులు సిహెచ్ తేజస్విని, సిహెచ్ ప్రజ్వల, ఉపాధ్యాయులు నవీన్‌కు మార్ ప్రదర్శనలో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఆధునాతన విధానంలో ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, ఏవో వెంకటరావు తదితరులు అభినందించారు.



ప్రాపర్టీ ఎక్స్‌పోలో బ్యాంకు అధికారులు

'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'కార్యాలయంలో ప్రాపర్టీ ఎక్స్ పో

గుంటూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరులోని ప్రాంతీయ (గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం) కార్యా లయంలో ప్రాపర్టీ ఎక్స్‌పోను శనివారం నిర్వహించింది. ప్రాపర్టీ ఎక్స్‌పోలో , వేలం కోసం 21 ఆస్తులు ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొన్ని ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. ఎక్స్‌పోకు హాజరైన చీఫ్ మేనేజర్ బికె ప్రసాద్, ఇతర సిబ్బంది సందర్శకులకు స్వాగతం పలికి విజయవంతం చేశారు.

చీఫ్‌విప్ జీవీకి పంచుమర్తి భూపతిరావు శుభాకాంక్షలు



జీవీ ఆంజనేయులుకు శుభాకాంక్షలు తెలియ జేస్తున్న పంచుమర్తి భూపతిరావు తదితరులు

వినుకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాసనసభ చీఫ్‌వి ప్‌గా నియమితులైన వినుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును శనివారం గుంటూరులోని ఆయన నివా సంలో ఉమ్మడి గుం టూరు, కృ ష్ణ జిల్లాల పట్టుబద్రుల ఎమ్మెల్సీ వినుకొండ నియోజకవర్గ పరిశీల కుడు పంచుమర్తి భూపతిరావు కలిసి శాలువాలతో అభినందిం చారు.రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ఆయన కృతజ్ఞ తలు తెలిపారు. ఆయనతోపాటు బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావలి శ్రీనివాస యాదవ్, గుంటూరు జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు అడప శివప్రసాద్, బాబు శ్రీనివాసరావు, మండవ పాములపాటి శ్రీనివాసరావు ఉన్నారు.

బస్సుల రాకపోకల్లో సమయపాలన పాటించాలి

గుంటూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బస్సుల రాకపోకల్లో సమయపాలన పాటించాలని జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్ రవికాంత్ సూచించారు. బస్సుల రాక పోకల సమయపాలనపై నెల రోజుల పాటు జరిగే మాసోత్సవాలను డీపీటీవో శనివారం ఎన్టీఆర్ బస్టాండ్‌లోని గుంటూరు-1,2 డిపోలలో ప్రారంభించారు.

కళ్ల ముందు జరిగినవే...

కథలుగా!


హకీం జాని రచించిన బాలసాహితీ పుస్తకాలు

ఆయన కలం చేతబట్టారంటే కథలు జాలు వారాల్సిందే. కళ్ల ముందు జరిగిన సామాజిక అంశాలను ఇతివృత్తంగా చేసుకుని ఎన్నెన్నో కథలు రచించారు. పిల్లలకు అర్థమయ్యేరీతిలో పద ప్రయోగాన్ని సంధించి పుస్తకాలను అచ్చు వేయించి పంచి పెడుతున్నారు. తెలుగు భాషలోకి ఆంగ్ల పదాలు చొచ్చుకొస్తున్న ప్రస్తుత తరుణంలో సరళమైన పదాలతో కథలు రచించి పిల్లల్లో మాతృ భాషపై మమకారం పెంచేందుకు కృషి చేస్తున్నారు. విద్యార్థి దశలో నాటకాల రచయిత, కళాకారుడిగా, ఆ తర్వాత బాలసాహితీవేత్తగా, నేడు కథల పుస్తకాలకు రచయితగా వ్యవహరిస్తున్న ఆయనే తెనాలి నందులపేటకు చెందిన షేక్ హకీం జాని.

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు తోబుట్టువులు ఉన్న కుటుంబంలో హకీం జాని ఒక్కరే మగ సంతానం. ఆయన తండ్రి ఫరీద్ సాహెబ్ తెనాలి మున్సిపాల్టీలో చిరుద్యోగం చేసి రిటైర్డ్ అయ్యారు. తల్లి మహబూబ్‌బీ గృహిణి. పదో తరగతి వరకు మున్సిపల్ స్కూల్‌లో చదవుకున్న హకీం జాని ఇంటర్, డిగ్రీ తెనాలి వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో పూర్తి చేశారు. బీఈడీని మహబూబ్‌నగర్‌లో పూర్తి చేశారు. కాగా 8వ తరగతి చదువుతున్న రోజుల్లో అప్పట్లో కళలకు కాణాచి అయిన తెనాలిలో ప్రతి పాఠశాలలో నాటక ప్రదర్శనలు జరిగేవి. తనకు కూడా ఒక పాత్ర ఇప్పించమని పాఠశాలలో తనకంటే పై తరగతులు చదువుతున్న విద్యార్థులను అభ్యర్థించగా వారు కాదన్నారు. ఆ కసితో అప్పటికప్పుడు మూడు కథలు రాసి స్కౌట్ టీచర్ మద్ది కోటేశ్వరరావుకు అందజేశారు. ఆయన వాటిని చూసి ఆశ్చర్యపోయి 'కన్నందుకు శిక్ష' అనే నాటకాన్ని ప్రదర్శించేందుకు అనుమతించారు. అందులో కీలక పాత్రని హకీం జానీకే ఇచ్చారు. అయితే భారీ వర్షం కారణంగా ఆ ప్రదర్శన రద్దు అయింది. కొన్నాళ్లకు తెనాలిలోనే ఒక ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవంలో నాటకాల ప్రదర్శన జరుగుతుంటే తమకు కూడా అవకాశం కల్పించమని కోరగా చివరి నాటకంగా ఛాన్స్ ఇచ్చారు. దానిని ఆయన సద్వినియోగం చేసుకున్నారు. అది మొదలుకొని శ్రీకృష్ణదేవరా యలుగా 14 సార్లు 60 మంది విద్యార్థులతో కలిసి నటించి మన్ననలు పొందారు. అల్లూరి సీతారామరాజుగానూ పాత్రకు జీవం పోశారు. జీవనోపాధి కోసం ఆయన తెనాలిలోని మాంటిస్సోరి, వివేక, సెయింట్ జాన్స్ స్కూళ్లలో పని చేశారు.



షేక్ హకీం జాని

71 పుస్తకాలు రచన...

1991లో రచనపై ఆయనకు మక్కువ కలిగింది. దాంతో అప్పట్లో పత్రికల్లో ఉత్తరాల శీర్షిక అని ఒకటి ప్రచురితమయ్యేది. దేశంలో జరుగుతున్న పరిణామాలపై పాఠకులు స్పందనని అందులో పొందుపరిచేవారు. దీనిని హకీం జాని సద్విని యోగం చేసుకొని ఏడాది పాటు ఏ రోజుకు ఆ రోజు జరిగిన పరిణామాలపై ఉత్తరాలు రాశారు. ఆ తర్వాత మా ఊరు - మా గొప్ప శీర్షికతో తెనాలి ప్రత్యేకతని వివరిస్తూ రాసిన కథనానికి మంచి గుర్తింపు వచ్చింది. సూపర్‌స్టార్ కృష్ణ, విజయనిర్మల, దాసరి నారాయణరావు, బ్రహ్మానందం, ఎస్‌వీ కృష్ణారెడ్డి, రావూరి భరద్వాజ, సుమన్ వంటి ఎందరో ప్రముఖుల ఇంటర్వ్యూలు చేశారు. 2023 నాటికి 71 పుస్తకాలు రచించారు. ఆయన రచనలు హైదరాబాద్, విజయవాడ పుస్తక ప్రదర్శనలతోపాటు తెలుగు రాష్ట్రాలలోని గ్రంథాలయాలు, అమెజాన్ ఈ-కామర్స్‌లోనూ స్థానం పొందాయి.

నీతి కథలు.. బాల సాహితి పుస్తకాలు

బాలసాహిత్యంపై రచనలు చేయాలని బాల బంధు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య సూచనలతో హకీం జాని రచనలు ప్రారంభించారు. చిన్నారులకు అర్థమయ్యేలా సరళమైన భాష, పొందికైన పదాలతో వాక్య నిర్మాణం చేసి 36 బాల సాహితి పుస్తకాలను రచించారు. మన వీర వనితలు, అంబేడ్కర్ జీవిత చరిత్ర, బాధ్యతాయుత పౌరుడు, కొత్త వెలుగు, వికటకవి, అమ్మఒడి వంటి పేర్లతో పుస్తకాలను అచ్చు వేయించారు. ఎక్కువగా సామాజిక అంశాలు, నీతి కథలకే ప్రాధాన్యం ఇచ్చారు. అంతేకాకుండా 270కి పైగా నీతి కథలు పిల్లల కోసం రచించినవి వివిధ పత్రికల్లో, ఆదివారం అనుబంధాల్లో ప్రచురితమయ్యాయి. మల్లన, బమ్మెర పోతన, మరియా మాంటిస్సోరి వంటి బాలసాహితీ పుస్తకాలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. 75కి పైగా పంచతంత్ర, 82 తెనాలి రామకృష్ణ, 56 మర్యాదరామన్న, 160 ఈసప్ నీతి, 220 ముల్లా నసీరుద్దీన్ కథలు సేకరించి రచించగా ప్రచురణ కర్తలు అందమైన బొమ్మలతో పిల్లలను ఆకర్షించేలా ముద్రించారు. బాలసాహితీ రంగంలో హకీం జానీ చేసిన కృషికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్, ఏషియన్ వరల్డ్ ఫిలిం ఫెస్టివల్‌లోనూ గుర్తింపు తెచ్చి పెట్టాయి. ఎన్టీఆర్ జీవిత చరిత్రపై నాలుగు నెలల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడులోనూ అధ్యయనం చేసి రచించిన అవతార పురుషుడు పుస్తకం అచ్చయి ఆవిష్కరణ జరిగిన రోజు తన జీవితంలో మరిచిపోలేనిదని హకీం జానీ చెప్పారు. తెనాలిలో రెండు రోజుల పాటు జరిగిన బాపు బొమ్మల ప్రదర్శన సందర్భంలో తన సేవలను గుర్తించి బాపు చేతి నుంచి తన చిత్రం రూపుదిద్దుకోవడం మరిచిపోలేనిదన్నారు.


హకీం జాని నాటక ప్రదర్శన


సీఎం చంద్రబాబు చేతుల మీదగా పురస్కారం అందుకొంటున్న హకీం జాని (ఫైల్)

● ఎన్నో సామాజిక అంశాలకు అక్షర రూపం ● పిల్లలకు తెలుగు భాషపై మమకారం పెంచే ప్రయత్నం ● విద్య, నాటక రంగాల్లోనూ విశిష్ట సేవలు ● ఆంధ్రా ప్యారిస్ బహుముఖ ప్రజ్ఞాశాలి షేక్ అబ్దుల్ హకీం జాని

ప్రజాహక్కుల ఉద్యమాలలో సాయిబాబాది అద్వితీయమైన పాత్ర

-డాక్టర్ కొల్లా రాజమోహన్

బాపట్లనవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా హక్కుల ఉద్యమాలలో ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబా పాత్ర అద్వితీయమైనదని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ రాజమోహన్ మాట్లాడుతూ చిన్నతనంలోనే పోలియోసోకి రెండుకాళ్ళు చచ్చుబడినా జీవితంలో స్వయం కృషితో, పట్టుదలతో సాయిబాబా ఎదిగారని తెలిపారు. వైకల్యాన్ని లెక్క చేయకుండా విద్యార్థి దశ నుంచే ఉద్యమాలలో మమేకమై ఆదివాసీహక్కుల కోసం పోరాడిన తీరు ఆదర్శవంతమైనదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రశ్నించేవాళ్ళ నోళ్ళుమూయటానికి తప్పుడు కేసులతో ఉపా చట్టం కింద విచారణ లేకుండా సంవత్సరాల తరబడి జైలులో పెడుతున్నారన్నారు. సాయిబాబా కూడా ఈవిధంగా శిక్ష అనుభవించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సి. హెచ్. గంగయ్య, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు కల్పన, దేవతోటి వీరాస్వామి, సజ్జా వెంకటేశ్వర్లు, కోట వెంకటేశ్వరరెడ్డి పాల్గొని సాయిబాబా సేవలను కొనియాడారు. ఆయనకు ఘన నివాళులు అర్పించారు.


సభలో మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు కొల్లా రాజమోహన్

సర్‌చార్జికి.. సున్నం

గుంటూరు సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ ఆర్థిక పాపాలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని స్థానిక సంస్థలకు కోలుకోలేని దెబ్బ తగిలింది. జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు రావాల్సిన సొమ్మును కూడా జగన్ ప్రభుత్వం ఆరగించేసింది. ఫలితంగా గడచిన ఐదేళ్లుగా ఉమ్మడి జిల్లాకు రిజిస్ట్రేషన్, మైనింగ్ శాఖల నుంచి రావాల్సిన బకాయిలు చూస్తుంటే కళ్లు తిరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ ప్రతి దస్తావేజుకు మార్కెట్ విలువలో 7.5 శాతాన్ని స్టాంప్ డ్యూటీ రూపేణా వసూలు చేస్తుంది. అందులో 1.5 శాతం సర్‌చార్జి కింద స్థానిక సంస్థలకు చెల్లించాలి. గతంలో నేరుగా ఈ సొమ్ము స్థానిక సంస్థలకు జమయ్యేది. సీఎఫ్‌ఎంఎస్ (కాంప్రహెన్సీవ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ సిస్టం) ద్వారా చెల్లింపులు మొదలైన తర్వాత మొత్తం సొమ్ము ప్రభుత్వానికి చేరుతుంది. అక్కడ నుంచి వాటాల వారీగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ అవుతుంది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థలకు రావాల్సిన సొమ్మును కూడా రాకుండా చేశారు. గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలోని స్థానిక సంస్థలకు రావాల్సిన రూ కోట్లను దారిమళ్లించారు.

బకాయిలపై జడ్పీ చైర్‌పర్సన్ దృష్టి

రిజిస్ట్రేషన్, మైనింగ్ శాఖల నుంచి రావాల్సిన బకాయిల విలువ తేల్చేందుకు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా ఈ మధ్య ఓ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వచ్చిన మూడు జిల్లాల ఆయా శాఖల అధికారులు సమాచారం లేకుండా వచ్చారు. చైర్ పర్సన్ ఆగ్రహంతో తగిన సమాచారంతో మళ్లీ వస్తామని చెప్పి వెళ్ళారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి బకాయిల వివరాలు సేకరించారు. ఈ ప్రకారం ఒక్క గుంటూరు జిల్లాలోనే గడచిన ఐదేళ్లలో రూ.37 కోట్ల సర్‌చార్జి బకాయి ఉన్నట్లు తేలింది. కొన్ని కార్యాలయాల్లో గత ఐదేళ్లుగా ఒక్క రూపాయి కూడా సర్‌చార్జి కింద జమ కాలేదని తెలుస్తోంది. ఉదాహరణకు అనంతవరం రిజిస్ట్రార్ కార్యాలయంలో 2019 మార్చి నుంచి ఇప్పటివరకు రూ.2,57,36,205 వరకు, తాడికొండ నుంచి రికార్డు స్థాయిలో రూ.9 కోట్లుకుపైగా సర్ చార్జి పెండింగ్‌లో ఉంది. గుంటూరు జిల్లాలోని 18 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి సర్‌చార్జి జమ కాకుండా పెండింగ్‌లో ఉంది. పల్నాడు జిల్లాలో స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి సుమారు రూ.13 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. బాపట్ల జిల్లాలో కూడా కోట్లలో బకాయిలు ఉన్నట్లు జడ్పీ వర్గాలు చెబుతున్నాయి.

- దారిమళ్లించిన జగన్ ప్రభుత్వం
- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
- స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్, మైనింగ్ రాయల్టీ పెండింగ్
- ఐదేళ్లలో చెల్లింపులు లేకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం

మైనింగ్ రాయల్టీది అదే దారి..

మైనింగ్ రాయల్టీ కింద ఉమ్మడి జిల్లాలోని స్థానిక సంస్థలకు భారీ మొత్తంలో రావాల్సి ఉంది. ఎంత బకాయిలు ఉన్నారో కూడా చెప్పడానికి మైనింగ్ అధికారులు నీళ్లు నములుతున్నారు. ఇంత మొత్తంలో మైనింగ్, రిజిస్ట్రేషన్ శాఖలు స్థానిక సంస్థలకు బకాయిలు పడటం రాష్ట్రం అవతరించిన తర్వాత ఇదే మొదటి సారి అంటున్నారు. ఫలితంగా స్థానిక సంస్థల్లో కనీస అవసరాలు కూడా తీరక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

చాలా ఇబ్బందులు పడ్డాం



గడచిన ఐదేళ్లలో జడ్పీకి రావాల్సిన సర్‌చార్జి, రాయల్టీ సొమ్మును పక్కదారి పట్టించి. అభివృద్ధి పనులకు నిధులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. కనీస అభివృద్ధి కార్యక్రమాలు కూడా చెప్పట్టలేకపోయాం. బకాయిల విడుదలపై ప్రభుత్వ పెద్దలను ఎన్నిసార్లు కలిసినా ఫలితం లేకుండా పోయింది. వైసీపీ పాలనలో స్థానిక సంస్థలకు చాలా ద్రోహం జరిగింది.

- కత్తెర హెనీక్రిస్టీనా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

కాలమ్-6.. సరిదిద్దారు

● అడంగల్ అవస్థలకు చెక్ ● భూ విక్రయాలకు లైన్‌క్లియర్

(5వ పేజీ తరువాయి)

రికార్డుల లోపాలను సరిచేయాలని రెండు నెలల క్రితం సీఎం చంద్రబాబుకు అర్జీ పెట్టారు. ఇదే తరహాలో తెనాలి నుంచి 49 మంది అర్జీలు అందాయి. అయితే సీఎంకు అర్జీ ఇచ్చినా ఖాజాబీ సమస్యకు పరిష్కారం లభించలేదు. దీంతో పదిరోజుల క్రితం కుమారుడు చనిపోయాడని ఖాజాబీ తెనాలి తహసీల్దార్‌ను కలిసి కన్నీరు పెట్టుకుంది. దీనికితోడు సీఎం నుంచి ఈ తరహా అర్జీలపై పరిష్కారానికి ఒత్తిడి రావటంతో దీనిపై తహసీల్దార్ గోపాలకృష్ణ స్పందించారు. అసలు సమస్యపై కసరత్తు చేస్తే, ఒక్క తెనాలి మండలంలోనే 5,808 భూ రికార్డుల్లో లోపాలు జరిగినట్లు గుర్తించారు. అటు నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలోనూ అక్కడి అధికారులు మరో వెయ్యి మంది, గుంటూరు డివిజన్ పరిధిలో మరో 1600 రైతుల రికార్డుల్లో లోపాలను ప్రాథమికంగా గుర్తించారు. ఆర్ఎస్ఆర్‌లో ఏ సర్వే నంబరు భూమి ఏ విభాగంలో ఉందనేది స్పష్టంగా ఉండటంతో రైతులను తిప్పాల్సిన పనిలేకుండా సవరించవచ్చన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఇదే విషయాన్ని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ, గుంటూరు జేసీ భార్గవ్ తేజ దృష్టికి తీసుకువెళ్లారు. వారుకూడా సానుకూలంగా స్పందించారు. దీంతో కేవలం పక్షం రోజుల్లో మూడేళ్లనాటి సమస్యకు పరిష్కారం చూపారు. మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తరహా చర్యలకు రెవెన్యూ అధికారులు ముందుకు వస్తే రైతుల కష్టానికి ఊరట లభించినట్టే. తెనాలిలో గుర్తించిన 5,808 రైతుల రికార్డుల్లో 5,763 మంది రికార్డులను సరిదిద్దారు. మరో 45 మంది రైతులకు సంబంధించిన రికార్డుల విషయంలో సాంకేతిక ఇబ్బందులు ఉండటంతో జేసీ దృష్టికి తీసుకువెళ్లామని, వాటికి కూడా త్వరలో పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ గోపాలకృష్ణ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పరిష్కారం లభించింది



అనారోగ్యంతో ఉన్న కుమారుడు ఫకీర్‌ను బతికించుకునేందుకు 2.61 ఎకరాల భూమిని అమ్ముకోవాలనుకుంటే ప్రభుత్వ భూమి కింద ఉంది అమ్మడానికి కుదరదన్నారు. సంవత్సరంన్నర నుంచి తిరిగినా పట్టించుకున్నవారులేరు. గత నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అర్జీ పెట్టుకున్నాం. ఆయన స్పందించినా కొందరు అధికారులు లంచాల ఆశతో మా అర్జీకి పరిష్కారం చూపలేదు. పది రోజుల క్రితం మా అబ్బాయి చనిపోయాడు. అదే విషయాన్ని మళ్లీ సీఎం దృష్టికి తీసుకువెళదామని అనుకుంటున్న తరుణంలో రికార్డులు సరిచేశారని, సమస్య పరిష్కారం అయిందని తహసీల్దార్ చల్లని కబురు చెప్పారు. నాతోపాటే చాలా మంది కష్టం తీరిందని తెలిసి సంతోషపడ్డాం. నాకు ఉపయోగపడకపోయినా, మిగిలినవారి అవసరాలకైనా అండగా ఉంటుందనుకున్నాం.

-ఖాజాబీ, తెనాలి

ఎన్నిసార్లు తిరిగామో..



మా భూమిపై మాకు హక్కులేదన్నారు. అడంగల్‌లో చూస్తే ప్రభుత్వ భూమి అని చూపిస్తుంటే, అధికారులను కలసి విన్నవిస్తే, చూస్తాం, చేస్తాం అంటూ మూడేళ్లుగా తిప్పారు. ఎట్టకేలకు సమస్యకు పరిష్కారం లభించింది. చిన్న సవరణకు సంవత్సరాలు పట్టింది. నిజంగా అధికారులు మనస్ఫూర్తిగా చేస్తే మాకు ఇటువంటి సమస్యలు ఉండవు.

-వి.పద్మలత, బుర్రిపాలెం

రైతులకు మేలు జరిగితే చాలని..



నేను తెనాలి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టాక వచ్చిన ఫిర్యాదుల్లో అధికశాతం భూములకు సంబంధించినవే. ఈ క్రమంలో రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదని, లోపం ఎక్కడనేది అన్వేషిస్తే అసలు పొరపాటు బయటపడింది. దీనిపై జిల్లా అధికారులకు విన్నవిస్తే సానుకూలంగా స్పందించారు. జేసీ ప్రత్యేక ఉత్తర్వులిచ్చారు. సిబ్బంది రాత్రి పగలు తేడా లేకుండా ఆన్‌లైన్ రికార్డులను సరిచేశారు. మూడేళ్లుగా తిరిగిన రైతులు ఇప్పుడు సంతోషంతో ఉన్నారు.

-గోపాలకృష్ణ, తహసీల్దార్, తెనాలి

బాలోత్సాహం







పెదకాకాని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్ 2024 వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల ప్రాంగణంలో కోలాహలంగా కొనసాగుతున్నాయి. చిన్నారుల కేరింతలతో రెండో రోజు శనివారం ఉత్సాహంగా పోటీలు జరిగాయి. పెద్దసంఖ్యలో సందర్శకులు హాజరు కావడంతో బాలోత్సవ్ ప్రాంగణం సందడిగా మారింది. 230 పాఠశాలల నుంచి 2500 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. జానపద నృత్యాలు, నాటికలు, సంగీతం తదితర అంశాలపై పోటీలు జరిగాయి. ఆయా ప్రదర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బాలబాలికలచే ప్రదర్శించిన 31 నాటికలు చిన్నారులకు సమాజంపై ఉన్న దృక్పథాన్ని సామాజిక అవగాహనను వెలికితీసే విధంగా సాగాయి. కథ, కవిత, లేఖా రచనలు వారిలోని సృజనాత్మకతను వెలికితీశాయి. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు అనుభవాల మార్పిడి కొత్తదనం నేర్పించడానికి ఉపయోగపడేలా న్యాయ నిర్ణేతలు ప్రత్యేక సూచనలు చేశారు. వాద్య సంగీతంలోని రాగం, తాళం ఆహూతులను ఆకట్టుకున్నాయి. పంచతంత్రం తెలుగు అనువాద గ్రంథం వీవీఐటీ 32వ ప్రచురణను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, బాలోత్సవ్ సృష్టికర్త వాసిరెడ్డి రమేష్‌బాబు ఆవిష్కరించారు.

సందడిగా వీవీఐటీ ప్రాంగణం

కోలాహలంగా కొనసాగుతున్న పోటీలు

తరలివచ్చిన 230 పాఠశాలలు, 2500 విద్యార్థులు


సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకిస్తున్న విద్యార్థులు



పంచతంత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాలోత్సవ్ కన్వీనర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దుగ్గిరాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

మంగళగిరి సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. గత ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ఏటా రూ.24 వేల చొప్పున 80 వేల మంది చేనేత కార్మికులకు అందజేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతకు చేసిన కేటాయింపులు చూస్తే నేతన్న నేస్తం పథకాన్ని పూర్తిగా ఎత్తివేసినట్టు అర్థమవుతుందని చెప్పారు. చేనేత పరిరక్షణకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నేతన్న నేస్తం, ఆరోగ్య బీమా అమలు చేసి సహకార సంఘాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇనమాల శివరామ్‌ప్రసాద్, ప్రతినిధులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, బల్లా వెంకటరమణ, గుర్రం చినవీరయ్య, బత్తూరి మోహన్‌రావు, అల్లక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష ఒత్తుల దీపోత్సవం



లక్షవత్తుల దీపాలతో అలంకరించిన శ్రీవేంకటేశుని నామాలు, శంఖు చక్రాలను తిలకిస్తున్న భక్తులు

దుగ్గిరాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పసుపు యార్డు సమీపంలో ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష ఒత్తుల దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామికి పలు రకాల అభిషేకాలు జరిపి, నైవేద్యం సమర్పణ అనంతరం భక్తులకు అర్చకుడు రామచంద్ర తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అందంగా తీర్చిదిద్దిన స్వామి వారి మూడు నామాలతోపాటు, శంఖు చక్రాలను లక్ష ఒత్తుల దీపాలతో అలంకరించారు. దీపోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలి వచ్చారు. కమిటీ సభ్యులు కొంగర సుధీర్‌కుమార్, ఫణికుమార్, ఉమామహేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంచార గ్రంథాలయం ప్రారంభం

మంగళగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పాత బ్యాంకు కాలనీలో డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య సంచార గ్రంథాలయాన్ని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య శనివారం ప్రారంభించారు. ఎందరో రచయితల కృషి ఫలితంగా పొందుపరిచిన విలువైన సమాచారాన్ని నేరుగా ప్రజల వద్దకే చేర్చాలన్న లక్ష్యంతో సంచార గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతలో పుస్తక పఠనం తగ్గి సెల్‌ఫోన్ ప్రాముఖ్యం పెరిగిన నేటి కాలంలో ఇంటి వద్దకే పుస్తకాలు అందించే సంచార గ్రంథాలయాన్ని ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది మాదిరాజు గోవర్ధనరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.విజయమోహనరావు, సంచార గ్రంథాలయం స్థాపకుడు ఆకురాతి కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

కాకుమాను, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ మిషన్ చైర్మన్‌గా నియమితులైన మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని మండల టీడీపీ నాయకులు కోరారు. మంగళగిరి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అగ్రికల్చరల్ మిషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్, సంగం డెయిరి మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి శనివారం దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అగస్టీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల బంగారు భవిష్యత్తుకు ప్రణాళికలు ఏర్పాటు చేసి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొని మర్రెడ్డి శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలిపారు.

ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికుల నిరసన

తాడేపల్లిటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు న్యాయంగా తమకు రావాల్సిన బకాయిల కోసం యాజమాన్యం స్పందించకపోవడంతో శనివారం దీక్ష శిబిరంలో తమ నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు చేస్తున్న దీక్షలు 20వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలిచ్చే వరకు పోరాటం

మంగళగిరి సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. నాలుగో వార్డు జెండా చెట్టు సెంటరు వద్ద శనివారం పేదల నుంచి నివేశన స్థలాల కోసం అర్జీలను స్వీకరించారు.

బీజేపీ హామీలు నెరవేర్చాలి

దుగ్గిరాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నేటికీ నెరవేర్చలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మండల గ్రామం మంచికలపూడిలో సీపీఎం 6వ మహాసభను శనివారం నిర్వహించారు.

చెత్త సేకరణ వాహనాలకు వీడిన గ్రహణం

● వైసీపీ వారు తుప్పు పట్టించారు
● కూటమి ప్రభుత్వంలో వదిలిస్తున్నారు

తుళ్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వంలో రాజధాని గ్రామాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచటానికి చెత్త సేకరణకు హెవీ వాహనాలను కేటాయించింది. చెత్త కుండీలలో చెత్తను లోడుచేసుకొని డంపింగ్ యార్డులో డంప్ చేయటం కోసం కొత్త వాహనాలను సమకూర్చింది. 12 వాహనాలను అప్పట్లో సీఆర్డీఏ కేటాయించింది. అవి రంగంలో దిగే సమయానికి ఎన్నికలు రావటం.. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి రాజధాని గ్రామాలపై వివక్ష చూపటంతో చెత్త తీసుకెళ్లే వాహనాలు మూలన పడి తుప్పు పట్టిపోయాయి. చెత్త డంపింగ్ యార్డులకు స్థలం కేటాయించాల్సి ఉండగా అది కూడా చేయలేదు. దీంతో పారిశుధ్య కార్మికులు ఊరికి ఆనుకొని



సీఆర్డీఏ కార్యాలయంలో సిద్ధంగా ఉన్న చెత్త తీసుకెళ్లే హెవీ వాహనాలు

చెత్తను పారేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో రాజధాని నిర్మాణ పనులకు టెండర్లు కేటాయింపులు జరుగుతున్నాయి. ఈ లోపు రాజధాని గ్రామాలలో పారిశుధ్యం అత్యంత మెరుగ్గా ఉండాలని వైసీపీ సర్కారులో తుప్పు పట్టించిన కొత్త చెత్త సేకరణ వాహనాలకు మరమ్మతులు చేసి అధికారులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతానికి తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో రెండు వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన వాహనాలను రాజధాని గ్రామాలలో ఉంచకుండా అవసరం లేకపోయినా విజయవాడ సిటీకి వైసీపీ ప్రభుత్వం అప్పట్లో తరలించింది. వాటిని వెనక్కి తెప్పించటమా.. లేక కొత్తవి కొనుగోలు చే యటమా అనేది అధికారులు ఆలోచన చేస్తున్నారు. మొత్తం మీద రాజధాని అమరావతి కాలుష్య రహిత పరిశుభ్ర నగరంగా ఉండబోతుందనటంలో సందేహం లేదు.

తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్డు నిర్మాణం పనులు

● తీరనున్న వాహనదారుల కష్టాలు

దుగ్గిరాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో మరమ్మతులకు సైతం నోచుకోక గుంతలమయమై అధ్వానంగా మారి నిత్యం ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, శరవేగంగా జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. నేటి వరకు భయంగుప్పెట్లో ఒకవైపు నిండుగా ప్రవహిస్తున్న బకింగ్‌హామ్‌కాల్వతో, మరోవైపు భారీగుంతలతో ఎదురయ్యే కుదుపులకు అదుపుతప్పి రెయిలింగ్ దాటి నీటిలోకి దూసుకెళతామోనన్న ఆందోళనతో డ్రైవింగ్‌పై మనసు లగ్నం చేయలేక ఆందోళనతో వాహన ప్రయాణం కొనసాగిస్తూ నిత్యం ప్రమాదాల మధ్య గడుపుతూ వచ్చారు. కాగా మంత్రి నారా లోకేశ్ దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా మంగళగిరిని నిలబెడతానని ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నారు. అందులో భాగంగానే తొలి విడతగా దుగ్గిరాల పాతలాకు నుంచి



దుగ్గిరాల సినిమాహాలు సమీపంలో జరుగుతున్న బీటీరోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మోరంపూడి వరకూ 4.2కి.మీ. మేర ఆర్‌అండ్‌బీ నిధులు రూ.2.5 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. తదుపరి రెండో విడతగా మోరంపూడి నుంచి రేవేంద్రపాడు వరకు రోడ్డు నిర్మాణం కొనసాగిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్రనాయుడు తెలిపారు.

వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధం

మంగళగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని మాల మహాసభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు అన్నారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్సీల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిషన్‌ను నియమించే అధికారం లేదన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్ ఉండగా మరొక కమిషన్‌ను వేయడం కుదరదన్నారు. మాల సామాజిక వర్గాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. సమావేశంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, బేతాళ శరత్‌బాబు, దళిత సంఘాల నేతలు చప్పిడి వెంగళరావు, అంబటి కొండలరావు, దండేల కృష్ణ, శుభకర్ పాల్గొన్నారు.

జర్నలిజం-జర్నలిస్టులు పుస్తకావిష్కరణ



జర్నలిజం-జర్నలిస్టులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారధి

మంగళగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఈపూరి రాజారత్నం రచించిన జర్నలిజం-జర్నలిస్టులు పుస్తకాన్ని ఏపీ సచివాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ జర్నలిస్టులకు జాతీయ పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగా జర్నలిజంలోకి రావాలనుకునే వారికి ఈ పుస్తకం దిక్సూచిలా నిలుస్తుందన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న మంచి చెడులను నిష్పక్షపాతంగా వెల్లడించే బాధ్యత జర్నలిస్టులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత ఈపూరి రాజారత్నం, మెడకాయల మస్తాన్‌రావు, బత్తుల సాంబశివరావు, ఎస్‌కే రఫీ, మల్లవరపు వెంకట్, ఈపూరి శేషగిరి, వినుకొండ నజరత్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో జాతీయ పత్రికాదినోత్సవం

తాడేపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని నులకపేట ప్రెస్‌క్లబ్ కార్యాలయం వద్ద శనివారం జాతీయ పత్రికా దినోత్సవం కార్యక్రమం జరిగింది. తొలుత కార్యాలయ ఆవరణలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జొన్నా వెంకటేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, నాగిరెడ్డిలు మాట్లాడుతూ ప్రెస్ కౌన్సిల్ ఆవిర్భావం సందర్భంగా ప్రతి ఏటా నవంబరు 16న జాతీయ పత్రికా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు సుబ్రహ్మణ్యం, చినబాబు, ప్రదీప్ పాల్గొన్నారు.

23న ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రకటన



వివిధ రాజకీయపార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాసరయ్య

తాడికొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితాను ఈనెల 23న ప్రకటిస్తామని తహసీల్దార్ కే.నాసరయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ శ్రీవెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాలలోని అడుసుమల్లి యశోదమ్మ భవనంలో ఎమ్మెల్సీ బూత్ నెంబరు 155, 156లో రెండు బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఓట్ల కోసం 2150 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. నవంబరు 24 నుంచి డిసెంబరు 9వ తేదీలోపు ఎమ్మెల్సీ ఓట్లలో మార్పులు, చేర్పుల కోసం అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నిర్మలకృష్ణ, ఎన్నికల డీటీ మోహినీకుమారి, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నల్లా, టీడీపీ నాయకులు తలశిల ప్రసన్నకుమార్, గుంటుపల్లి మధుసూదనరావు, రమేష్, సాంబశివరావు, బీఎస్పీ నాయకుడు బాబురావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగేశ్వరరావు, సీపీఎం నాయకుడు సీహెచ్ భాస్కరరావు పాల్గొన్నారు.

నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌ల నియామకం

గుంటూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నియోజకవర్గాలకు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విభజిత గుంటూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌ఛార్జ్ నియమిస్తూ ఆదేశాలు జారీ చేసిన ఆమె త్వరలో నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులతో సభలు, సమావేశాలు నిర్వహించి పార్టీలో పునరుత్తేజం కల్పించాలని సూచించారు. కాగా జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న చిలకా విజయ్‌కుమార్‌ను తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. గతంలో ఆయన తాడికొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అలానే మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలిని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. పశ్చిమ నియోజకవర్గానికి రాచకొండ జాన్‌బాబు, తెనాలికి డాక్టర్ చందు సాంబశివుడు, పొన్నూరుకు గాదె నాగేశ్వరరావు, ప్రత్తిపాడుకు కొరివి వినయ్‌కుమార్, మంగళగిరికి షేక్ సలీమ్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ భవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జ్ శ్రీపతి ప్రకాశం, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్‌లు ఇన్‌ఛార్జ్‌లను అభినందనలు తెలియజేస్తూ పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గడ్డంపాల్ విజయ్‌కుమార్, బొట్ల బ్రహ్మయ్య తదితరులున్నారు.

విశ్రాంత పంచాయతి కార్యదర్శి మృతి

ఫిరంగిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంకు చెందిన పోలిశెట్టి రాజారావు (72) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారని బంధువులు తెలిపారు. రాజారావు ఫిరంగిపురం, మేరికపూడి, రేపూడి, కారంపూడి, పొనుగుపాడు, 113 తాళ్ళూరు గ్రామాల్లో కార్యదర్శిగా పనిచేసి విశ్రాంతి పొందారు. ఆయన మండల తెలుగుదేశం పార్టీ నాయకుడిగా కూడా పని చేశారు. అతడికి కుమారులు పాపారావు, రవికుమార్, జోసెఫ్ ఉన్నారు. మృతదేహాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, పీఎల్ మరియన్న, వజ్రాల అయ్యపరెడ్డి, చిట్టా వీరారెడ్డి, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

సేంద్రియ సాగుతో నాణ్యమైన ఉత్పత్తులు, దిగుబడులు

వట్టిచెరుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రసాయనానికి ఎరువుల వాడకం తగ్గించి పంటల సాగులో జీవ ఎరువులు వినియోగించటం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు, అధిక దిగుబడులు సాధించవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. తమ విద్యాబోధనలో భాగంగా గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో కొంత కాలంగా విద్యార్థులు వట్టిచెరుకూరు గ్రామంలో ఉంటూ రైతుల అనుభవాలు, సూచనలను క్షేత్ర స్థాయిలో అవగాహన చేసుకుంటున్నారు. అందులో భాగంగా శనివారం రైతులకు జీవామృతం తయారు చేసే విధానాన్ని అలాగే వినియోగించే విధంగా ప్రయోగాత్మకంగా వివరించారు. జీవామృతం ద్వారా పైరు ఎదుగుదలతో పాటు చీడపీడల నివారణకు దోహదపడతాయని వివరించారు.

పోస్టల్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

దుగ్గిరాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోవాలంటే డీబీటీ విధానంలో లబ్ధిదారుల ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని పోస్టల్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు అన్నారు. పోస్టల్ ఖాతాలకు ఆధార్ అనుసంధానంపై అవగాహన కార్యక్రమాన్ని చిలువూరు పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. శివనాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఖాతాదారుడు ఆధార్ ప్రక్రియ పూర్తి చేసేందుకు సిబ్బంది సహకారం అందించాలన్నారు. ఖాతాదారులు ఈనెల 30లోగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్‌బాబు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, పోస్టల్ బ్యాంక్ మేనేజర్ ప్రశాంతి, పంచాయతీ కార్యదర్శి ఎం.శరత్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలి

తాడికొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బాల, బాలికలు సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలని యాక్సెస్ టూ జస్టిస్ జిల్లా సమన్వయకర్త కోలా సమీర్‌కుమార్ అన్నారు. పొన్నెకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యంలో బాలలు హానికరమైన ప్రదేశాలు, ప్రమాదాలు గుర్తించాలి-నివారణ చర్యలు చేపట్టాలి అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్ జరిగినప్పుడు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ పోర్టల్‌లో కూడా మహిళల మీద, బాలల మీద జరిగే సైబర్ నేరాలపై ఫిర్యాదులను అందజేయ వచ్చునని తెలిపారు. బాలల మీద లైంగిక వేధింపులు చాలా తీవ్రంగా జరుగుతున్నాయని తెలిపారు. లైంగిక వైధింపులకు గురైన పిల్లలు 112 నెంబర్‌కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్-క్రాఫ్ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ సీహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ బోరు బావులు, నేలమట్టం బావులు, జన సంచారం ఉన్న ప్రాంతాల్లో వేలాడుతున్న కరెంటు వైర్స్, బాలలకు హానికరమైన వాటిని గుర్తించాలన్నారు. నేటి సమాజంలో బాల బాలికలు మాదకద్రవ్యాలకు గురై మత్తు పదార్థాల వాడకంతో వారి జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ కళావతి, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎండీ జరీనా, ఎస్‌కే షమీం, పినాకపాణి, జగదీష్, జీ.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సమాజ ఉన్నతకి సోపానాలు

మంగళగిరి సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయాలు సమాజ ఉన్నతకి సోపానాలని మంగళగిరి సీకే జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రత్నబాబు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళగిరి శాఖా గ్రంథాలయంలో శనివారం పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తొలుత గ్రంథాలయాల పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో లెక్చరర్ ఎన్ ఆనందరావు, డీఎస్ శర్మ, గ్రంథాలయాధికారి, పాఠకులు పాల్గొన్నారు. నూతక్కి శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు నివాళి అర్పించారు.

● తాడేపల్లి టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులపై మాదక ద్రవ్యాల ప్రభావం అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కాటూరి రాంబాబు మాట్లాడారు. తాను గ్రంథాలయానికి తరచూ వెళ్లి చదువుకున్న పుస్తకాల జ్ఞానమే తనను ప్రస్తుతం ఒక ఉపాధ్యాయుడిగా నిలబెట్టిందని అన్నారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్రే కీలకం

● డీఎల్‌పీవో శ్రీనివాసరావు



ప్రజా ప్రతినిధుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమని డీఎల్‌పీవో శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామాభివృద్ధి ప్రణాళికలపై ప్రజా ప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీఎల్‌పీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిపై ప్రజా ప్రతినిధులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పథకాలు, పరిపాలనా వంటి అంశాలు తెలిసి ఉండాలన్నారు. దీని కోసమే ఈ శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం అభివృద్ధి ప్రణాళికలపై కార్యదర్శులు ఖాజా, మూర్తిలు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి, జడ్పీటీసీ వి.కృష్ణారెడ్డి, ఎంపీపీ దాసరి అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొండవీటి వాగు, కొటేళ్ల వాగులపై బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు కేటాయించాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రాజధాని అమరావతికి, సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టులకు గుంటూరు నుంచి వెళ్లటానికి ప్రధాన రహదారిగా ఉన్న గుంటూరు-అమరావతి రహదారిలోని కొండవీటి వాగు, కొటేళ్ల వాగులపై బ్రిడ్జిలను నిర్మించటానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అసెంబ్లీలో కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014-19 టీడీపీ ప్రభుత్వం హయాంలో రూ.13.6 కోట్లు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బ్రిడ్జి నిర్మాణానికి నిధులు నిలిపివేశారన్నారు. కొండవీటి వాగు లాం వద్ద పొంగితే గుంటూరు నుంచి రాజధాని వెళ్లటానికి రాకపోకలు నిలిచిపోతున్నాయని తెలిపారు. రాజధానికి ముఖద్వారంగా ఉన్న కొండవీటి వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆర్‌అండ్‌బీ మంత్రిని కోరారు. అలాగే పెదపరిమి వద్ద ఉన్న కొటేళ్ల వాగు పొంగినప్పుడు తుళ్లూరు మండలానికి వెళ్లాలంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఒకటి, రెండు రోజులు రాకపోకలు ఆగిపోతున్నాయని తెలిపారు. రెండు చోట్లు బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు.

మండలానికో మహిళా మార్టు ఏర్పాటు : డీఆర్‌డీఏ పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

ప్రత్తిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు వీలుగా మండలానికో మహిళా మార్టు ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డ్వాక్రా సంఘాలకు సంబంధించి వీవోఏలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని, అందులో భాగంగానే ప్రతి మండలంలో మహిళా మార్టు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఉన్నతి కింద మహిళలకు రుణాలు అందించి వారి ఆదాయాన్ని పెంచుకునే విధంగా వడ్డీలేని రుణాలు అందజేస్తామన్నారు. అందులో భాగంగానే షీ ఆటోలు కూడా ఇస్తున్నారన్నారు. ఐబీ డీపీఎం కామేశ్వరి, ఎల్‌హెచ్ అండ్ బ్యాంక్ లింకేజి డీపీఎం కేశవ్, శ్రీనిధి ఏజీఎం హర్షవర్ధన్, ఎంపీడీవో శివపార్వతి, ఏపీఎం లాజర్, అన్ని గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

రెండు ఎరువుల దుకాణాలపై 6ఏ కేసుల నమోదు



ఎరువుల గిడ్డంగిలో తనిఖీ నిర్వహిస్తున్న ఏవో అరుణకుమారి

ప్రత్తిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని ఎరువుల దుకాణాలలో వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నారన్న కారణాలతో ఏవో అరుణకుమారి ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు దుకాణాల్లో రికార్డులకు, నిల్వలకు ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించి వారిపై 6ఏ కింద కేసులు నమోదు చేసినట్లు ఏవో తెలిపారు. ప్రత్తిపాడులోని మోహన్ ట్రేడర్స్‌లో 42.97 మెట్రిక్ టన్నులు వ్యత్యాసం ఉండగా దీని విలువ రూ.12,13,920 అని, అలాగే మాక్స్ సొసైటీలో 10.75 మెట్రిక్ టన్నుల వ్యత్యాసం ఉండగా దీని విలువ రూ.1,18,250 అని తెలిపారు. అలాగే మండలంలో ఎక్కడైనా ఎక్కువ ధరలకు ఎరువులు విక్రయిస్తుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఏవో అరుణకుమారి రైతులను కోరారు. ఎరువుల దుకాణదారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్సును కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.


షూటింగ్ బాల్ జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక



షూటింగ్ బాల్‌లో జిల్లా జట్టుకు ఎంపికైన బాలికలు

తాడికొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ అండర్-17, అండర్-19 బాల, బాలికల జట్ల ఎంపికలు శనివారం తాడికొండలోని శ్రీవెల్లంకి వెంకటప్పయ్య హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పీఈటీ శ్రీనివాస్ మాట్లాడుతూ షూటింగ్ బాల్ ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 100 మంది బాల, బాలికలు వచ్చినట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈనెల 23, 24, 25 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన బాల, బాలికలను పాఠశాల ఉపాధ్యాయులు, షూటింగ్ బాల్ కార్యవర్గ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.రమణయ్య, ఎం చంద్రశేఖర్, షూటింగ్ బాల్ కార్యవర్గ సభ్యులు రవిబాబు, కిషోర్, నరేష్, రవికాంత్ పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో కల్చరల్ ఫెస్ట్



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

తాడికొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : లాం చలపతి ఫార్మసీ కళాశాలలో పూర్వవిద్యార్థుల సంఘం, ఐపీఏ లాం లోకల్ శాఖ, కళాశాల కల్చరల్ కమిటీ సంయుక్తంగా బిట్స్ వగాంజ పేరుతో కల్చరల్ ఫెస్ట్-2024ను శనివారం నిర్వహించారు. చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ కల్చరల్ ఫెస్ట్‌లో నృత్య ప్రదర్శనలు, గానం, నాటకాలు, సినిమా క్విజ్, ఇన్‌స్ట్రుమెంట్ ప్లేయింగ్, ఫ్యాషన్ పెరేడ్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఫెస్ట్‌లో పలు జిల్లాల విద్యార్థులు 18 కళాశాలల నుంచి 734 మంది వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంజని సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ డాక్టర్ వీబాల భాస్కరరావు, గుంటూరు ప్రభుత్వ వైద్యశాల నాట్కో క్యాన్సర్ సెంటర్ కో-ఆర్డినేటర్ వై అశోక్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

ధూళిపాళ్లను మంత్రి వర్గంలోకి తీసుకోవాలి : కొల్లా

కాకుమాను, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను ఎన్డీయే మంత్రి వర్గంలోకి తీసుకోవాలని సంగం డెయిరీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లా వీరయ్య చౌదరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని తన జవసత్వం ద్వారా సుదీర్ఘ రాజకీయ నాయకుడిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. సంగం డెయిరీపై తప్పుడు కేసుల నమోదు చేసి చైర్మన్‌గా వ్యవహరించిన నరేంద్రకుమార్‌పై అక్రమ కేసుల బనాయించిన వైసీపీ, జగన్‌కు ఎదురొడ్డి నిలబడినట్లు తెలిపారు. ఆరు దఫాలుగా జిల్లాలో గెలిచిన నరేంద్రకుమార్‌కు మంత్రి పదవి కేటాయించి పొన్నూరు ప్రజల ఆశలను, ఆకాంక్షలను గౌరవించాలని కొల్లా కోరారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం క్యాంపు కార్యాలయంలో ఇద్దరు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. చావావారిపాలెం గ్రామస్థుడు బొడ్డు కిరణ్, కొలకలూరు గ్రామస్థుడు పణాల శంకర్‌కు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.



నాగారుపమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

ఘనంగా తెప్పోత్సవం

పొన్నూరుటౌన్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరులో వేంచేసివున్న నాగారుపమ్మ తల్లి దేవత తెప్పోత్సవ కార్యక్రమాన్ని శనివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ప్రభల ఉత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. ప్రత్యేక పూజలు అనంతరం గ్రామంలోని చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి తిరునాళ్ళకు ఏర్పాటు చేసిన ప్రభల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ స్థానిక నెహ్రూనికేతన్ విద్యార్థులు శనివారం గాంధీచౌక్‌లో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ముందుగా బోసురోడ్డులోని పాఠశాల నుంచి మొదలైన ర్యాలీని ఎండీ.మురళీకాంత్, ఈడీ గీతాకాంత్‌లు ప్రారంభించారు. వర్షపు నీటిని ఇంకుడు గుంతలతో నిల్వ చేసుకోవాలని, ఆహార వ్యర్థాలు పశువుల ఎరువుతో కంపోస్టు తయారు చేసి సేంద్రీయ వ్యవసాయం చేయాలని విద్యార్థులు ప్రదర్శనల ద్వారా వివరించారు. ఎరువులు, పురుగు మందులు కారణంగా ఆహార ఉత్పత్తులు కలుషితమవుతున్నాయని, ఫలితంగా ప్రజలు రకరకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారంటూ సేంద్రీయ వ్యవసాయ విధానం ప్రాముఖ్యతను స్థానిక ప్రజలకు వివరించారు.

మంత్రి మనోహర్‌కి

కాంట్రాక్టు ఉద్యోగుల వినతి

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న నాల్గొవ తరగతి ఉద్యోగులు మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన ఆయనకు తమ సమస్యలు వివరించారు. 2022 నవంబరు నుంచి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సాధారణ సేవలు పెంచాలని, 62 ఏళ్ళకు ఉద్యోగ విరమణ వర్తింప చేయాలని, ప్రభుత్వ నియామకాల్లో సర్వీసు పరిగణలోకి తీసుకోవాలని, ఉద్యోగాలు రెగ్యూలర్ చేయాలని వారు మంత్రిని కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో

జేఎంజే విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బెంగుళూరుకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్‌మేనేజ్‌మెంట్ సంస్థ స్థానిక జేఎంజే కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఆ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. డిగ్రీ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 112 మంది హాజరుకాగా 27 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో డైరెక్టర్ సంజయ్ సుబ్రహ్మణ్యం, హెచ్ఆర్ బాషా, రిలేషన్ మేనేజర్ సోమప్ప, ప్రిన్సిపాల్ షైనీ, కరస్పాండెంట్ తెరేసమ్మ, సుధాకరయ్య, శారద పాల్గొన్నారు.

ఆగమ విద్యార్థులకు

నిరుద్యోగ భృతి కల్పించాలి

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆగమ విద్యార్థులకు నిరుద్యోగ భృతి కల్పించాలని అర్చక సమాఖ్య కార్యదర్శి అనంతాచార్యులు కోరారు. గంగానమ్మపేట వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగమ పాఠశాలలో ఏడు ఏళ్ళ పాటు అభ్యాసనం చేసిన నిరుద్యోగులు తగిన ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి నిరుద్యోగ భృతి అందజేయాలని దేవాదాయ శాఖ మంత్రిని కలసి వినతిపత్రం అందించామన్నారు. కార్యక్రమంలో రఘు, గురునాధప్రసాద్, మాధవ, చక్రవర్తి పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రీ స్కూల్లో శనివారం టూల్స్ ఫర్ సక్సెస్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లల మానసిక వైద్య నిపుణురాలు కిరణ్మయి చౌదరి పాల్గొని ప్రసంగించారు. నర్సరీ నుంచి 5వ తరగతి వరకు పిల్లల పెంపకం ఎదగాల్సిన విధానం వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, జ్యోతి, పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో ఆస్పత్రి అభివృద్ధి

● మంత్రి మనోహర్

● దాతల సహకారంతో జీజీహెచ్‌కి ఏసీలు..

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం వహించేలా చూస్తామని, రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పట్టణానికి చెందిన బొమ్మదేవర వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి దుర్గ సహకారంతో ఏర్పాటు చేసిన ఎనిమిది ఎయిర్ కండీషనర్‌లను శనివారం మంత్రి ప్రారంభించారు. ఆస్పత్రిలో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల వార్డును సందర్శించి శిశువులకు అందుతున్న వైద్య సేవలు పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో సౌకర్యాలకు సహకారం అందిస్తున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. డాక్టర్ నన్నపనేని ప్రతాప్ కూడా ఆస్పత్రి అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆయన సహకారంతో ఆస్పత్రిని మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. రోగులకు అందుతున్న భోజన వసతిని తెలుసుకున్నారు. రోగులకు అందించే బోజనం బాగుండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి, డాక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో ఏసీలను ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్, చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న మంత్రి

అర్హులైన పేదలందరికి ఉచిత గ్యాస్

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందని మంత్రి మనోహర్ అన్నారు. సుల్తానాబాద్‌లో శుక్రవారం రాత్రి ఉచిత గ్యాస్ పంపిణీని పరిశీలించారు. సుగాలి, వడ్డెర కాలనీల్లో ఇళ్ళకు వెళ్ళి ఉచిత గ్యాస్ తీసుకున్నది లేదని విచారించారు. ఇళ్ళలో గ్యాస్ స్టౌవ్‌పై పాలు పెట్టి వెలిగించారు. మహిళలతో సంక్షేమ పథకాలపై ముచ్చటించారు. పలువురి లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు పాల్గొన్నారు.

బర్నబాసు హత్య కేసులో సీఐడీ రంగప్రవేశం

● కుట్రదారుల్లో వణుకు

పొన్నూరుటౌన్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం వ్యాపారి బర్నబాసు హత్య కేసులో సీఐడీ రంగ ప్రవేశంతో ఈ కేసులో ప్రమేయం ఉన్న కుట్రదారుల్లో వణుకు మొదలైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023వ సంవత్సరంలో రేషన్ బియ్యం మాఫియాలో వచ్చిన విభేదాల కారణంగా పొన్నూరు పట్టణానికి చెందిన బర్నబాసు హత్య జరిగింది. ఈ హత్య కేసులో 11 మంది నిందితులను గుర్తించి గతంలోనే పోలీసులు అరెస్టు చేశారు. అయితే, బర్నబాసు భార్య నందిని తన భర్త హత్య కేసులో వైసీపీకి చెందిన కీలక నాయకులు ఉన్నారని, అప్పటి పోలీసులు దర్యాప్తు సక్రమంగా చేయలేదని తనకు న్యాయం చేయలని కోరుతూ సీఐడీకి ఫిర్యాదు చేశారు. తన భర్త సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, అందులో కీలక సమాచారం ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, ఎన్నికల సమయంలో నాడు ప్రచారానికి వచ్చిన చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ సైతం ఈ హత్య కేసు గురించి ప్రస్తావించారు. ఈ హత్య కేసు లోగుట్టు విప్పుతామని వారు ప్రకటించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బర్నబాసు భార్య విజ్ఞప్తి మేరకు ఈ కేసును సీఐడీకి ప్రభుత్వం అప్పగించింది. కొన్ని రోజుల క్రితం సీఐడీ డీఎస్పీ పొన్నూరు వచ్చి ఈ హత్య కేసుకు సబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలు, చార్జ్ షీట్‌లు సేకరించారు. అంతే కాకుండా కీలక సమాచారం సైతం సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. బర్నబాసు హత్యకు ముందు పొన్నూరులో, మండలంలోని ఓ గ్రామంలో ఈ కేసుకు సంబం ధించిన కీలక నిందితులు పలుమార్లు సమావేశం కావడం, బర్నబాసు నుంచి ప్రతి నెలా ముడుపులు అందిన వారి వివరాలను సేకరించే పనిలో సీఐడీ ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో కీలక నిందితులను విచారణ చేయకుండా వదిలి వేయడంపైనా సీఐడీ దృష్టి సారించింది. అప్పట్లో కేసు దర్యాప్తు సాగించిన, విచారణ జరిపిన పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సైతం గోప్యంగా సేకరిస్తున్నారు. అయితే, ఈ కేసు విషయంలో సీఐడీ అధికారులు గుంబనంగా వ్యవహరిస్తుండటంతో కుట్రదారులు మల్లగుల్లాలు పడుతున్నారు. సీఐడీ విచారణ వేగవంతం చేస్తే అసలు కుట్ర దారులు దోషులుగా నిలబడతారని బర్నబాసు కుటుంబీకులు అభిప్రాయపడుతున్నారు.



కొల్లిపరలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీవో పద్మజ, ఎంపీడీవో విజయలక్ష్మి

సమయపాలన పాటించాలి

● డీఎల్‌డీవో పద్మజ

కొల్లిపర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సచివాలయం సిబ్బంది తప్పని సరిగా సమయపాలన పాటించాలని డీఎల్‌డీవో పద్మజ అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపరలో సచివాలయాలను ఎంపీడీవో విజయలక్ష్మితో కలిసి ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది సమయ పాలన పాటించకపోతే తగినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుటుంబ సర్వేను వెంటనే పూర్తి చేయాలని, పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. తనిఖీలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, డీఎల్‌డీవో ఏవో లక్ష్మీన్నారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి వెంకటరత్నమ్మ శనివారం పెదరావూరు గ్రంధాలయాన్ని తనిఖీ చేశారు. గ్రంధాలయ వారోత్సవాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. గ్రంధాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రమౌళి, రాఘవేంద్రరావులు పాల్గొన్నారు నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంధాలయంలో ప్రముఖులను స్మరించుకున్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అయినాల మల్లేశ్వరరావు, మొవ్వా సుబ్బారావు, కావూరి రమాదేవి, పాల్గొన్నారు. మహిళా బాలల గ్రంధాలయంలో విద్యార్థులకు లైబ్రేరియన్ అంజని ఆటల పోటీలు నిర్వహించారు.

తెనాలి-విజయవాడ

రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం

● తీరనున్న వాహనదారుల కష్టాలు

దుగ్గిరాల(ఆంధ్రజ్యోతి), నవంబరు 16: ఐదేళ్లలో మరమ్మతులకు సైతం నోచుకోక గుంతలమయమై అధ్వానంగా మారి నిత్యం ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, శరవేగంగా జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. నేటి వరకు భయంగుప్పెట్లో ఒకవైపు నిండుగా ప్రవహిస్తున్న బకింగ్‌హామ్‌కాల్వతో, మరోవైపు భారీగుంతలతో ఎదురయ్యే కుదుపులకు అదుపుతప్పి రెయిలింగ్ దాటి నీటిలోకి దూసుకెళతామోనన్న ఆందోళనతో డ్రైవింగ్‌పై మనసు లగ్నం చేయలేక ఆందోళనతో వాహన ప్రయాణం కొనసాగిస్తూ నిత్యం ప్రమాదాల మధ్య గడుపుతూ వచ్చారు. కాగా రాష్ట విద్య, ఐటీ, మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా మంగళగిరిని నిలబెడతానని ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నారు. అందులో భాగంగానే తొలి విడతగా దుగ్గిరాల పాతలాకు నుంచి మోరంపూడి వరకూ 4.2 కి.మీ. మేర ఆర్అండ్‌బీ నిధులు రూ.2.5 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. తదుపరి రెండో విడతగా మోరంపూడి నుంచి రేవేంద్రపాడు వరకు రోడ్డు నిర్మాణం కొనసాగిస్తామని ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్ర నాయుడు తెలిపారు.



బీటీరోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ధూళిపాళ్ళ నరేంద్రకు

మంత్రి పదవి ఇవ్వండి

గుంటూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు న్యాయం చేయాలని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి టీడీపీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి 2004 ఎన్నికల్లో జయకేతనం ఎగరవేసిన ఒకే ఒక్కడిగా చరిత్ర సృష్టించిన టీడీపీ యోధుడు నరేంద్ర ప్రతిపక్షంలో వున్న రెండు సార్లు చంద్రబాబుకు కుడిభుజంగా నిలిచారని గుర్తుచేశారు. నాటి సీఎం రాజశేఖరరెడ్డిపై అలుపెరుగని పోరాటం చేసి అసెంబ్లీటైగర్‌గా ప్రజల ఆశీస్సులు అందుకున్న నరేంద్రకు మంత్రిపదవి వచ్చేదెప్పుడని ప్రశ్నించారు. తాను ఎంతో ఆవేదనతో అధి ష్టానాన్ని అభ్యర్థిస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ సంక్షోభంలో కూరుకుపోయినా, దాడులకు వెరువక, వెనుకంజ వేయక, పక్కచూపులు చూడకుండా పోరాడిన నరేంద్రకు క్యాబినెట్ స్థాయి పదవులే కరువయ్యాయా అని ఆవేదన వ్యక్తం చేశారు.

ధూళిపాళ్లకు ప్రాధాన్యం లేకపోవడం శోచనీయం



టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న బీసీ సెల్ నాయకులు

పొన్నూరుటౌన్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ కలిగిన నాయకుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు సముప్రాధాన్యం లభించకపోవటం శోచనీయం అని గుంటూరు పార్లమెంట్ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో బీసీ సంఘాల నాయకులు సమావేశమైయ్యారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్న ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పొన్నూరు అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేయటమే కాకుండా ప్రజా వ్యతిరేఖ విధానాలపై ఉద్యమించి జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. నిబద్ధత కలిగిన నరేంద్ర కుమార్‌కు తెలుగుదేశం పార్టీ సముచిత స్థానం కల్పించాలని నాయకులు తీర్మానం చేసి టీడీపీ అధినేతకు పంపించారు. అలాగే పురపాలక సంఘంలోని మాజీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే నరేంద్ర కమార్‌కు సంఫీభావంగా సమావేశమైయ్యారు. నరేంద్ర కుమార్‌ను క్యాబినెట్ ర్యాంక్‌లకు పరిగణనలోకి తీసుకోకపోవటం మన స్థానానికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ గుంపుల ప్రసన్న, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆకుల సాంబశివరావు, ఆలపర్తి చంద్రమోహన్, యరసాని శ్రీరామూర్తి, శెట్టి లింగేశ్వరరావు, పిన్నమనేని కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ చౌదరి, షేక్ జానీ బాషా, మహ్మద్ గౌస్, షేక్ సిలార్ బాషా, ఖాదర్ జానీ, ఎద్దు శోంబాబు, దుర్గయ్య, బాజీ సాహెబ్, లత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సంఘీభావం

ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు క్యాబినెట్ పదవి కేటాయించాలని కోరుతూ పొన్నూరు పట్టణ, మండలానికి చెందిన టీడీపీ మహిళా నేతలు సంఘీభావం తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం పట్టణ, మండలానికి చెందిన తెలుగు మహిళా కమిటీల సమావేశం జరిగింది. నలభై ఐదేళ్లగా తెలుగుదేశం పార్టీకి ధూళిపాళ్ళ కుటుంబం చేస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ధూళిపాళ్ళ కుటుంబం సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించి నరేంద్రకు క్యాబినెట్ స్థాయి పదవిని కేటాయించాలని కోరారు.



ఎమ్మెల్యేకు సంఘీబావం తెలుపుతున్న మహిళా నేతలు

హౌస్‌హోల్డ్ సర్వేకు సహకరించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హౌస్‌హోల్డ్ సర్వేకు సహకరించాలని పట్టణ పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న ప్రజలను కోరారు. స్థానిక చెంచుపేటలోని 28వ వార్డులో జరుగుతున్న హౌస్‌హోల్డ్ జియో కోఆర్డినేట్స్ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు ఈ సర్వేకు సహకరించాలని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందాలంటే హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌తో పాటు జియో ట్యాగింగ్‌లో కుటుంబ సభ్యుల వివరాలను తప్పక నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

అదుపులో శాంతిభద్రతలు

డీఎస్పీ బీ.జనార్ధనరావు

ఫటా ఫట్



బీ.జనార్ధనరావు డీఎస్పీ

తెనాలి క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 'తెనాలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలు పూర్తి అదుపులో ఉన్నాయి. రౌడీయిజం, గంజాయి, జూదం వంటి వాటిని పూర్తిగా కట్టడి చేశాం. తెనాలిలో పూర్వపు ప్రశాంత నెలకొంది' అని డీఎస్పీ బీ.జనార్ధనరావు అన్నారు. పలు విషయాలపై డీఎస్పీతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్..'

ప్రశ్న: గతంలో పట్టణంలో రౌడీయిజం చలాయించిన వారితో ప్రజలు కొంత నష్టపోయారు. ఆందోళనకు గురయ్యారు. వీరి రౌడీయిజం అదుపు చేయగలిగారా?

జవాబు: గతంలో రౌడీయిజం చలాయించిన వారిని జల్లెడ పట్టి కోరలు పీకాం. ఇప్పుడు వీరి పరిస్థితి వానపాములాంటిది.

ప్రశ్న: సబ్ డివిజన్ పరిధిలో ఎంత మంది రౌడీషీటర్లను గుర్తించారు?

జవాబు: సబ్ డివిజన్ పరిధిలో ఎనిమిది పోలీస్ స్టేషన్ల పరిధిలో 300 మంది రౌడీషీటర్లను గుర్తించాము. ప్రతి వారం వీరు పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలి. తిరిగి వీరు నేరాలు చేయకుండా రూ.5 లక్షలకు బైండవర్ చేశాం. అవి కట్టకపోతే జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.

ప్రశ్న: అధికార పార్టీ గొడుగు కింద చేరిన రౌడీలపై చర్యలు తీసుకుంటారా?

జవాబు: రౌడీలు ఏ పార్టీలు అయినా చట్టానికి అతీతులు కారు. చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

ప్రశ్న: గతంలో జిల్లాలోనే గంజాయికి తెనాలి ప్రసిద్ధి. వీటిని కట్టడి చేశారా?

జవాబు: గంజాయిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వీటి సాగు ప్రాంతంలోనే గట్టి నిఘా ఉండటంతో సరఫరా నిలిచింది. తెనాలిలో గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లను తుడిచి వేశాం. మారుమూల ప్రాంతాల్లో వీరి సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలి.

ప్రశ్న: పట్టణంలోని లాడ్జిల్లో వ్యభిచారం సాగుతుందోని ఆరోపణ ఉంది..

జవాబు: లాడ్జీలలో వ్యభిచారంపై నిత్యం నిఘా కొనసాగుతుంది.

ప్రశ్న: తెనాలిలో ట్రాఫిక్ కష్టాలు ఎప్పుడు తీరుతాయి?

జవాబు: వాస్తవంగా తెనాలికి ముగ్గురే ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు. ట్రాఫిక్ సమ్యను దృష్టిలో ఉంచుకుని 10 మంది సివిల్ పోలీసులను ట్రాఫిక్ విధుల్లో ఉంచుతున్నాము.

ప్రశ్న: నైట్ పెట్రోలింగ్ సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలు..

జవాబు :- పట్టణంలో నైట్ పెట్రోలింగ్ యదావిధిగా కొనసాగుతుంది. అనుమానితులుగా భావించిన వారిని స్టేషన్‌కు తరలించి ప్రశ్నించడంతో పాటు అర్ధరాత్రి వేళ జులాయిగా తిరుగుతున్న వారిని కట్టడి చేస్తున్నాం.

ప్రశ్న: మహిళలను, విద్యార్థినులను వేధించే వారిపై ఎవరికి ఫిర్యాదు చేయాలి

జవాబు: మహిళలను, విద్యార్థినులను ఎలాంటి వారైనా ఇబ్బందులకు గురి చేస్తుంటే వెంటనే డీఎస్పీ కార్యాలయం సెల్ నెం.9440796206కు ఫోన్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.




ఇన్‌చార్జిలకు అభినందనలు తెలియజేస్తున్న శ్రీపతి ప్రకాశం, లింగంశెట్టి, మస్తాన్‌వలి తదితరులు

ఏడు నియోజకవర్గాలకు

కాంగ్రెస్ ఇన్‌చార్జిల నియామకం

గుంటూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విభజిత గుంటూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిలను నియమిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులతో సభలు, సమావేశాలు నిర్వహించి పార్టీలో పునరుత్తేజం కల్పించాలని సూచించారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న చిలకా విజయ్‌కుమార్‌ను తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలిని, పశ్చిమ నియోజకవర్గానికి రాచకొండ జాన్‌బాబును, తెనాలికి డాక్టర్ చందు సాంబశివుడు, పొన్నూరుకు గాదె నాగేశ్వరరావు, ప్రత్తిపాడుకు కొరివివినయ్‌కుమార్, మంగళగిరికి షేక్ సలీమ్‌లను ఇన్‌చార్జిలుగా నియమించారు. ఈసందర్భంగా రాజీవ్‌గాంధీ భవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జ్ శ్రీపతి ప్రకాశం, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్‌లు ఇన్‌చార్జిలకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డంపాల్ విజయ్‌కుమార్, బొట్ల బ్రహ్మయ్య, బిళ్ళా సునీల్, మల్లెల మోషే పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

పొన్నూరుటౌన్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీవో గుమ్మ చంద్రశేఖర్ రావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయితీల ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాజ్యాంగం గ్రామ పంచాయితీలకు విశేష అధికారాలను అందించిందని, వాటి అభ్యునతి కోసం ప్రజా ప్రతినిధులు పాటుపడాలని, గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించాలని సూచించారు. ప్రజలు కోరిన పనులకు తీర్మానాలు చేసి పంపితే వాటి మంజూరుకు కృషి చేస్తామని అన్నారు. గ్రామ సభలు తీర్మానాలు పంపకపోవడం వల్ల కొన్ని పంచాయితీలకు ఆర్థిక సంఘం నిదులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయలేదని తద్వారా పంచాయితీలకు నష్ట జరిగిందని అన్నారు. ఇప్పటికైనా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమష్టిగా గ్రామ సభలు నిర్వహించి అవసరమైన పనులపై తీర్మానాలు చేయాలని కోరారు. పంచాయితీల నిర్వహణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ విధుల గురించి తెలిపారు.

పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శాసన మండలి ఓట్ల దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బీ.శేషన్న తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కృష్ణా, గుంటూరు శాసన మండలి గ్రాడ్యుయేషన్ నియోజకవర్గానికి 17వేలకు పైగా దఖాస్తులు అందాయన్నారు. కొల్లిపరలో 1, తెనాలి పట్టణంలో 12 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందిన దరఖాస్తులను పరిశీలించి ఓటు హక్కు కల్పించడం జరుగుతుందన్నారు. ఒకటి కన్నా ఎక్కువ దరఖాస్తులు ఒక ఓటరు అందిస్తే ఒకటి మాత్రమే పరిశీలిస్తామన్నారు. సచివాలయాలకు దరఖాస్తు దారులను పిలిచే అవసరం ఉండదని, ఇంటి వద్దే వెరిఫికేషన్ చేస్తారని, సర్టిఫికేట్లపై గజిటెడ్ అధికారుల సంతకం ఒత్తిడి ఉండదని తామే పెనిలి టేడ్ చేస్తామన్నారు. పరిశీలన సమయంలో ఒరిజినల్ సర్టిఫికేట్లను దరఖాస్తు దారులు చూపాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

అధిక ధరలను తక్షణమే నియంత్రించాలి

● సీపీఎం నాయకుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని పేద ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని సీపీఎం సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధిక ధరలను నియంత్రించాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఎం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ అధిక ధరలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉచిత ఇసుకను అందరికి అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచడం వలన పేదప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వరదలు కారణంగా లంక భూముల్లో ఇసుక మేట వేసిందని దానిని తొలగించటానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకం క్రింద పెట్టుబడి సాయం రూ 20వేలు రైతులకు, కౌలు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోటా చంద్రశేఖర్, జిలుగు ముక్కంటి, శ్రీనివాసరావు, బత్తుల సుబ్బారావు, దర్శి బర్నబా తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు